



కృష్ణమ్మే తోడు...!



కృష్ణానది ఒడ్డున వేటకు సిద్ధమవుతున్న మత్స్యకారులు

● మత్స్యకారుల్లో పుంజుకున్న ఉపాధి వేగం ● నదీమతల్లి పరవళ్లే వారికి ఆలనా పాలనా.. ● వరద తాకిడితో గట్టుకు చేరుతున్న జాలర్ల గుడిసెలు

ఆత్మకూరు, జూలై 24:
సప్తనదీ సంగమ క్షేత్రంలోని కృష్ణా తీరమంతా మత్స్యకారులకు ఆలవాలం. సూర్యోదయం మొదలుకుని నదీ జలాలపై బతుకు పోరాటం చేసే మత్స్యకారుల ఆలనా.. పాలనా అంతా కృష్ణమ్మే. రాత్రిళ్లు సైతం నదీమతల్లి పరవళ్లే వారికి జోలపాట. ఎక్కడి నుంచో వలసలొచ్చి కృష్ణమ్మనే నమ్ముకుని, నల్లమల అందాల నడుమ సేదతీరుతూ నదీతీరం వెంట మత్స్యకారుల సాగిస్తున్న జీవన విధానాలను గమనిస్తే.. కృష్ణమ్మతో వారికి ఉన్న ఆత్మీయ అనుబంధం ఏంటో అర్థం చేసుకోవచ్చు. ఇటీవల మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో కురిసిన భారీ వర్షాలతో శ్రీశైల జలాశయానికి ప్రస్తుతం ఎగువ ప్రాజెక్టుల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో శ్రీశైల జలాశయం వెనకతట్టు జలాల చెంతనే గుడిసెలు వేసుకుని పిల్లాపాపలతో జీవనం సాగిస్తున్న మత్స్యకారుల ఉపాధి వేగం పుంజుకుంది. కృష్ణా నదిలో వరద జలాలు పరవళ్లు తొక్కడంతో చేపలు పట్టేందుకు అనువుగా ఉంటుంది. దీంతో సంగమేశ్వరం సమీపంలోని సోమశిల, సిద్ధేశ్వరం, జానాల, సంగమేశ్వరం, పెద్దగుమ్మడాపురం, మాడుగుల, ఎర్రమఠం తదితర గ్రామాల మత్స్యకారులతో పాటు వైజాగ్, కాకినాడ జిల్లాల నుంచి పొట్టకూటి కోసం వచ్చిన జాలర్లు చేపలు పట్టేందుకు ఇంటిల్లిపాది సన్నద్ధమవుతున్నారు.



ట్రాక్టర్లలో సామగ్రిని ఎగువ ప్రదేశాలకు తరలిస్తున్న దృశ్యం

వరద తాకిడితో గట్టుకు చేరుతున్న జాలర్ల గుడిసెలు

శ్రీశైల జలాశయానికి వరద రాకముందు నదీజలాలు తక్కువగా ఉండటంతో సంగమేశ్వరం ఆలయ సమీపంలో కృష్ణానది ఒడ్డున గుడిసెలు ఏర్పాటు చేసుకుని పిల్లాపాపలతో అక్కడే జీవనం సాగించేవారు. వారికి కావాల్సిన అన్ని నిత్యావసర సరుకులు, ఇతర సామగ్రిని గుడిసెల్లో నిల్వ ఉంచుకుని బతుకు పోరాటం చేసేవారు. అయితే ప్రస్తుతం కృష్ణానదికి వరద తాకిడి మొదలవడంతో మత్స్యకారులు ఏర్పాటు చేసుకుని గుడిసెల వద్దకు నదీజలాలు వచ్చి చేరాయి. దీంతో అప్రమత్తమైన మత్స్యకారులు తమ గుడిసెలను, చేపలు పట్టే సామగ్రి మొత్తాన్ని ఎగువ ప్రదేశానికి చేర్చుతున్నారు. ఈ సామగ్రిని ట్రాక్టర్లు, మరబోట్లపై వేసుకుని వరద తాకిడి లేని ప్రదేశానికి చేరుకుంటున్నారు. అక్కడ గుడిసెలు ఏర్పాటు చేసుకున్న తర్వాత వరద జలాల్లో చేపలు పట్టేందుకు అన్ని విధాలుగా సన్నద్ధం అవుతున్నారు.



కృష్ణా నదికి వరద రావడంతో సంగమేశ్వరాన్ని ఖాళీ చేస్తున్న మత్స్యకారులు

వరద జలాలపైనే మత్స్యకారులకు గంపెడు ఆశలు :

సాధారణ రోజులతో పోల్చితే వరద ప్రవహం ఉన్నప్పుడే భారీగా చేపలు చిక్కుతాయని మత్స్యకారులు చెబుతున్నారు. నదిలో నీరు తగ్గుముఖం పట్టినట్లయితే రోజుకు ఐదు నుంచి 15 కేజీల వరకు కూడా చేపలు లభ్యమయ్యేవి కావు. అయితే వరద సమయాల్లో మాత్రం అదృష్టం బాగుంటే ఒకే రోజే, ఒకే పుట్టి ద్వారా ఏకంగా నాలుగైదు క్వింటాళ్ల చేపలు చిక్కేవి. చేప సైజ్‌ను బట్టి కేజీల చొప్పున హోల్‌సెల్ కంపెనీల వారికి విక్రయిస్తుంటారు. ఎక్కువ సైజు ఉండే చేపలు కిలో రూ.100 చొప్పున, సైజు తక్కువ ఉన్నట్లయితే రూ.80కి విక్రయించేవారు. ఈ లెక్కన వరద జలాల్లో మత్స్యకారులు ప్రతిరోజూ మంచి ఆదాయాన్ని పొందుతారు. అయితే అందుకు తగ్గట్లుగానే వారు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఎంతో కష్టపడాల్సి ఉంటుంది. కాగా సప్తనదీ సంగమేశ్వరంలో శ్రీశైలం బ్యాక్‌వాటర్‌లో నీరు తగ్గుముఖం పట్టే వరకు మత్స్యకారులు ఇక్కడే గుడిసెలు వేసుకుని చేపల వేటనే వృత్తిగా కొనసాగిస్తారు. ఉదయాన్నే ఓ విడత పుట్టిలపై నదీజలాల్లో ప్రయాణించి వలలు వేస్తారు. ఆ తర్వాత మరుసటి రోజు వలలను తిరిగి సేకరించి అందులో చిక్కిన చేపలను పడుతున్నారు. ఈ రకంగా సేకరించిన చేపలను విక్రయించుకుని తమ జీవనాన్ని సాగిస్తున్నారు. కృష్ణా తీరం నుంచి ఇతర ప్రాంతాలకు చేపలను ఎగుమతి చేసే వాహనాల డ్రైవర్ల ద్వారా నిత్యావసర సరుకులను తెప్పించుకుని బయటి ప్రపంచంతో ఏ మాత్రం సంబంధం లేకుండా కృష్ణా తీరంలోనే గడిపేస్తున్నారు. కనీసం రాత్రివేళల్లో విద్యుత్ సదుపాయం లేకున్నప్పటికీ కృష్ణమ్మ సవ్వడులు, ఆకాశంలోని వెన్నెలే వెలుగుగా నిలుస్తున్నాయి. శ్రీశైలం జలాశయంలో నీటి నిల్వలు తగ్గే వరకు ప్రతిరోజూ వారి జీవన పోరాటం బిజీబిజీగా గడుస్తుంది.



సంగమేశ్వరంలో మత్స్యకారుల ఆవాసాల వద్దకు చేరిన వరద జలాలు

ఐదేళ్లుగా కృష్ణమ్మ పక్కనే జీవిస్తున్నాం



మా స్వగ్రామంలో సరైన ఉపాధి లేకపోవడంతో అనకాపల్లి జిల్లాలోని బంగారుపాలెం నుంచి సంగమేశ్వరానికి ఐదేళ్ల క్రితం కుటుంబసమేతంగా వలస వచ్చాం. కృష్ణాతీరంలోనే తాత్కాలిక గుడిసెలను ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నాం. నదిలో నీరు తగ్గుముఖం పట్టినప్పుడు ప్రతిరోజూ 5 నుంచి 15కేజీల చొప్పున చేపలు పట్టి వాటిని విక్రయిస్తాం. ఈవిధంగా సమకూరిన సొమ్ముతోనే జీవిస్తున్నాం.

- సత్తిబాబు, బంగారుపాలెం, అనకాపల్లి జిల్లా

వరద సమయంలోనే మంచి ఆదాయం




సాధారణ రోజులతో పోల్చితే కృష్ణానదికి వరద వచ్చినప్పుడు ఎక్కువగా చేపలు చిక్కుతాయి. వరదజలాల్లో పెద్దసైజు చేపలు రావడంతో మిగతా రోజుల కంటే అధిక మోతాదులో చేపలను విక్రయిస్తాం. వరద రోజుల్లో పడిన కష్టంతోనే కొంత ఆదాయాన్ని మిగుల్చుకోగలుతున్నాం. మా కుటుంబ సభ్యులందరం రోజుంతా ఇదే పనిలో నిమగ్నమై ఉంటాం.

- సత్యవతి, బంగారుపాలెం, అనకాపల్లి జిల్లా

ఇతర జిల్లాల నుంచి కృష్ణా తీరానికి వలస

విశాఖపట్నం, కాకినాడ, అనకాపల్లి తదితర ప్రాంతాలకు చెందిన మత్స్యకారులు ఉపాధి నిమిత్తం కృష్ణా తీరానికి తరలి వచ్చారు. ఇక్కడే తాత్కాలిక గుడిసెలను ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తూ చేపల వేటను వృత్తిగా కొనసాగిస్తున్నారు. కృష్ణానదిలో పుష్కలంగా నీరు ఉన్నప్పుడే చేపలు పట్టి ఉపాధి పొందేవారు. నదిలో నీరు తగ్గినట్లయితే తమ స్వగ్రామాలకు వెళ్లి కొన్ని నెలల పాటు అక్కడే ఉంటారు. నదిలో నీరు వచ్చినట్లయితే ఇక్కడికి చేరుకుని చేపలు పట్టి జీవనం సాగిస్తుంటారు. సంగమేశ్వరంతోపాటు చీమలతిప్ప ప్రదేశంలో చాలా మంది ఇతర జిల్లాల నుంచి ఇక్కడికి చేరుకుని చేపల వేటతో ఉపాధి పొందుతున్నారు. ఇదిలావుంటే విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాలకు చెందిన మత్స్యకారులు తమ ప్రాంతంలో సముద్రతీరం ఉండటం వల్ల చేపల వేట కొంత ఇబ్బందిగా ఉంటుందని, అందుకే ఇక్కడికి వచ్చామని చెబుతున్నారు.



కృష్ణానదికి వరద రావడంతో గుడిసెలను బోట్లలో ఎగువ ప్రదేశాలకు తరలిస్తున్న దృశ్యం

నేర నివారణే లక్ష్యంగా విజిబుల్ పోలీసింగ్

ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా



ఆయుధాలను పరిశీలిస్తున్న ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

నంద్యాల క్రైం, జూలై 24: నేర నివారణే లక్ష్యంగా విజిబుల్ పోలీసింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ పనులు జరగాలని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా పోలీస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధుల్లో పోలీస్ అధికారులు మట్కా, జూదం, మద్యం అక్రమ రవాణా, ఇసుక, డంకెన్ డ్రైవ్, రోడ్డు ప్రమాదాల నివారణకు మోటార్ వెహికల్ ఆక్ట్‌ను కట్టుదిట్టంగా అమలు చేయాలన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పోలీస్ అధికారులు, సిబ్బంది సహాయంతో డంకెన్ డ్రైవ్ చేపట్టి మొత్తం 21కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో భాగంగా 80ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు చేశామన్నారు. అడిషనల్ ఎస్పీ పర్యవేక్షణలో సెబ్ అధికారుల ఆధ్వర్యంలో అక్రమ మద్యంపై దాడులు చేసి ఐదు డీపీఎల్ కేసుల్లో 31.84లీటర్లు స్వాధీనం చేసుకోవడంతో పాటు ఒక ఎన్‌డీపీఎల్ కేసులో 248 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే కొలిమిగుండ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని కోటపాడు గ్రామంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు సీఐ గోపినాథరెడ్డి తన సిబ్బందితో దాడిచేసి ఐదుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.6,900 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

పోలీస్ కార్యాలయంలో పలు విభాగాల పరిశీలన

జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలోని పలు విభాగాలను ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా బుధవారం సందర్శించి వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. ముందుగా ఆయన ఆర్మ్‌డ్, రిజర్వ్, డీసీఆర్బీ, బిల్లాపామ్, స్పెషల్ బ్రాంచ్, పాస్‌పోర్ట్ విభాగం, సమావేశ మందిరం, జిల్లా పోలీస్ కార్యాలయ పరిసరాలను సందర్శించి పరిసరాలను, పరికరాలను పరిశీలించారు. ఆయా కార్యాలయాల విభాగాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఎంతమంది సిబ్బంది ఉన్నారు, ఏ తరహా విధులు నిర్వహిస్తున్నా రని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకు న్నారు. అనంతరం కార్యాలయాల పనితీరును మెరుగుపరిచేందుకు పలు సూచనలు చేసి వాటిని వెంటనే అమలు పరచాలని ఆదేశించారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సంతోష్, ఎస్పీ సీసీ నాగరాజు, ఇన్‌స్పెక్టర్ రవీంద్ర, వెంకటేశ్వరరావు, రిజర్వు ఇన్‌స్పెక్టర్ మంజునాథ్, నాగభూషణం, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అమృత్ భారత్ స్టేషన్లుగా నంద్యాల, డోన్

● రైల్వే బడ్జెట్‌లో చోటు



నంద్యాల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం బుధవారం ప్రవేశపెట్టిన రైల్వే బడ్జెట్‌లో జిల్లాకు ప్రాధాన్యం దక్కింది. నంద్యాల జిల్లాలోని నంద్యాల, డోన్ రైల్వే స్టేషన్లను అమృత్ భారత్ పథకం కింద ఆధునికీకరించేందుకు తీర్మానించింది. దీంతో ఈ రెండు స్టేషన్ల రూపు రేఖలు మారిపోనున్నాయి. అమృత్ పథకంలో చోటు దక్కడంతో నంద్యాల, డోన్ స్టేషన్లలో మౌలిక సదుపాయాలను మెరుగు పరచడంతో పాటు, ప్రయాణికులకు సౌకర్యవంతమైన అనుభూతిని అందించేందుకు స్టేషన్లు కొత్త హంగులు సంతరించుకోనున్నాయి. చిన్న వ్యాపార సమావేశాల కోసం ఎగ్జిక్యూటివ్ లాంజ్‌లు ఏర్పాటు చేయటం, మెరుగైన లైటింగ్ ఏర్పాట్లతో పాటు రోడ్లను వెడల్పు చేయడం, అనవసర నిర్మాణాలను తొలగించడం వంటి పనులను చేపడుతారు. అదే విధంగా ఎస్కలేటర్లు, ప్రయాణికుల కోసం వేచి ఉండే గదులు, వైఫై ఏర్పాటు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, సీసీటీవీ నిఘా వంటివి ఈ స్టేషన్లకు అందుబాటులోకి రానున్నాయి. అంతేకాకుండా ఈ పథకం కిందకు వచ్చే స్టేషన్ల చుట్టూ పట్టణాన్ని కూడా అభివృద్ధి చేస్తారు. రైల్వే బడ్జెట్‌లో నంద్యాల, డోన్‌కు చోటు దక్కడంతో జిల్లా వాసులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

జలాధివాసానికి చేరువలో సంగమేశ్వరం



సంగమేశ్వరాలయాన్ని ముంచెత్తుతున్న వరద నీరు

కొత్తపల్లి, జూలై 24: సంగమేశ్వరాలయం జలాధివాసానికి చేరువలో ఉంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు శ్రీశైలం జలాశయానికి పెద్ద ఎత్తున వరద నీరు వచ్చి చేరుతోంది. బుధవారం సాయంత్రం 6 గంటలకు జూరాల ప్రాజెక్టు నుంచి 1,75,448 క్యూసెక్కుల వరద నీరు శ్రీశైలం జలాశయానికి చేరింది. శ్రీశైలం జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా, 849.80 అడుగులుగా నమోదైంది. అలాగే జలాశయం నీటి సామర్థ్యం 215 టీఎంసీలు కాగా, 79.6340 టీఎంసీలుగా నమోదైంది. గంట గంటకు నీటి మట్టం పెరుగుతుండటంతో సంగమేశ్వరం ఆలయాన్ని వరద నీరు ముంచెత్తుతోంది. ఆలయం జలాధివాసానికి చేరువలో ఉంది. ఇలాగే వరద కొనసాగితే.. కేవలం మూడు రోజుల్లో సంగమేశ్వరాలయం పూర్తిగా జలాధివాసం అవుతుందని అంచనా. ఆలయ పురోహితుడు తెలకపల్లి రఘురామశర్మ అంత్య పూజలు నిర్వహించి గంగమ్మకు హారతులు ఇచ్చారు.

శ్రీశైలానికి ఇన్‌ఫ్లో



శ్రీశైలం, జూలై 24: ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి శ్రీశైల జలాశయానికి బుధవారం భారీగా వరద ప్రవాహం కొనసాగింది. జూరాల జలాశయం నుంచి 1,75,448 క్యూసెక్కులు వరద నీరు దిగువకు విడుదల చేశారు. బుధవారం సాయంత్రం 6 గంటల సమయానికి 1,76,980 క్యూసెక్కుల వరద శ్రీశైలం జలాశయానికి వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 849.80 అడుగులు, జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలుగా ఉంది. ప్రస్తుత నీటి నిల్వ 79.6340 టీఎంసీలుగా నమోదైంది. జలాశయం కుడి, ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రాల్లో ఎలాంటి విద్యుత్ ఉత్పత్తి జరగడంలేదు.

నిరుపేదలకు వైద్య సేవలందించాలి

● కలెక్టర్ రాజకుమారి



సమావేశంలో వివరాలు అడుగుతున్న కలెక్టర్

నంద్యాల (నూనెపల్లె), జూలై 24: ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ ద్వారా నిరుపేదలకు వైద్య సేవలం దించాలని కలెక్టర్ రాజకుమారి అన్నారు. బుధవారం కలెక్టర్ చాంబర్‌లో ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ సభ్యులతో డిస్ట్రిక్ట్ డిసిప్లినరీ కమిటీ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ కింద నిరుపేదల నుంచి ఎలాంటి రుసుం వసూలు చేయకుండా నాణ్యమైన వైద్య చికిత్స అందించాలన్నారు. జిల్లాలో 25 కార్పొరే ట్ ఆసుపత్రులు 11 సామాజిక ఆరోగ్య కేంద్రాలు, రెండు ఏరియా ఆసుపత్రులు 50 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 13 దంత వైద్య శాలలతోపాటు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ప్రభుత్వం సూచించిన 3257 వ్యాధులకు కార్పొరేట్ తరహాలో ఉచిత వైద్యం అందించాలన్నారు. వైద్య సేవలు పొంది డిశ్చార్జి అయిన రోగులకు ఎన్టీఆర్ ఆసరా కింద అవసరమైన మందులతోపాటు విశ్రాంతి సమయంలో జీవనభృతి కల్పించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జీజీహెచ్‌లో డెంగీ కేసులు నమోదయ్యే నేపథ్యంలో ప్లేట్‌లెట్స్ గుర్తించే రిఫ్రిజిరేటర్ సెంట్రి ఫ్యూజ్‌డ్ మిషన్‌కు సంబంధించిన ప్రతి పాదనలు వెంటనే ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ జఫ్రుల్లా, డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వెంకటరమణ పాల్గొన్నారు.

నంద్యాల జేసీగా విష్ణుచరణ్



నంద్యాల (నూనెపల్లె), జూలై 24: నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్‌గా విష్ణుచరణ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవలే ఐఏఎస్ అధికారుల బదిలీలు జరిగాయి. అందులో భాగంగా గతంలో నంద్యాల జేసీగా ఉన్న రాముల్ ఉమార్‌రెడ్డి బదిలీ కావడంతో ఆయన స్థానంలో విష్ణుచరణ్ వచ్చారు. బుధవారం ఆయన బాధ్యతలు చేపట్టిన అనంతరం కలెక్టర్ రాజకుమారిని మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందేశారు.

కర్నూలులో నిర్మాణంలో జీజీహెచ్ పనులు





కేశవా.. కరుణించవా..

నేడు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తొలి బడ్జెట్

టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తరువాత రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అసెంబ్లీలో ప్రవేశ పెట్టే తొలి బడ్జెట్ ఇది. ఓటాన్ అకౌంట్ బడ్జెట్ అయినా.. గత వైసీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన సాగు నీటి ప్రాజెక్టులు పట్టాలెక్కాలంటే కనీస రూ.వెయ్యి కోట్ల నిధులైనా కేటాయించాలని సాగునీటి నిపుణులు కోరుతున్నారు. కృష్ణా నదీ పరివాహక ప్రాజెక్టుల పర్యవేక్షణలో, నీటి పంపకాల్లో ఇబ్బందులు తొలగాలంటే కీలకమైన కృష్ణా బోర్డు (కేఆర్ఎంబీ) కార్యాలయం కర్నూలులో ఏర్పాటు చేయాలి. కర్నూలు, ఆదోని మెడికల్ కాలేజీ నిర్మాణాలు పూర్తి చేయడానికి అవసరమైన నిధులు ఇవ్వాలి. జగనన్న కాలనీల్లో పేదల ఇళ్లు పూర్తి చేసేందుకు, టిడ్కో ఇళ్లు పంపిణీ చేసేందుకు సంపూర్ణ సహకారం అందించాలి. ఇవి చేస్తేనే కర్నూలును అభివృద్ధి చేసినట్లవుతుంది. ప్రజల సమస్యలు పరిష్కరించినట్లవుతుంది. గురువారం బడ్జెట్ ఎలా ఉంటుందో చూడాలి.



- ఉమ్మడి జిల్లాలో పడకేసిన సాగునీటి ప్రాజెక్టులు
- గత జగన్ ప్రభుత్వంలో నీటి వనరులపై నిర్లక్ష్యం
- కనీసం రూ.వెయ్యి కోట్లు ఇవ్వాలంటున్న ఇంజనీర్లు
- కర్నూలు, ఆదోని మెడికల్ కాలేజీల పూర్తికి సహకరించాలి
- కృష్ణా బోర్డు కర్నూలులో ఏర్పాటుకు చొరవ చూపాలి
- కర్నూలు కరువు రైతుల ఆశలు

కర్నూలు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాల పునర్విభజన తరువాత అత్యంత వెనుకబడి జిల్లాగా కర్నూలు మిగిలింది. కేవలం 4.5 టీఎంసీలు సామర్థ్యం కలిగిన గాజులదిన్నె ప్రాజెక్టు మినహా ఒక్క ప్రాజెక్టు లేదు. రాష్ట్ర విభజన తరువాత అప్పటి టీడీపీ ప్రభుత్వం ఉమ్మడి కర్నూలు జిల్లాలో వేదవతి, ఆర్డీఎస్ కుడి కాలువ, గుండ్రేవుల జలాశయం వంటి ప్రాజెక్టులను మంజూరు చేశారు. రాయలసీమ జీవనాడి ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం, అవుకు బైపాస్ టన్నెల్‌ను ప్రతిష్టాత్మకంగా తీసుకొని పూర్తి చేశారు. నీరు-చెట్టు కింద వివిధ సాగునీటి వనరులు, కాలువలు, చెరువుల్లో పూడికతీత, మరమ్మతులు చేపట్టారు. 2019 మేలో సీఎం జగన్ సారథ్యంలో వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక ఐదేళ్లు జిల్లా సాగు నీటి ప్రాజెక్టులపై పూర్తిగా నిర్లక్ష్యం ప్రదర్శించారు. జిల్లాకు చెందిన బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లు ఆర్థిక శాఖ మంత్రిగా కొనసాగినా.. నిధులు కేటాయింపులో తీరని అన్యాయమే జరిగింది. ఎక్కడి ప్రాజెక్టులు అక్కడే పడకేశాయి. కనీసం గేట్లు కూడా మరమ్మతులకు నోచుకోలేదు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రజలు వైసీపీని ఘోరంగా ఓడించారు. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమికి పట్టం కట్టారు. కర్నూలు, నంద్యాల ఎంపీలతో పాటు 12 మంది ఎమ్మెల్యేలను గెలిపించి 1999 రికార్డును తిరగ రాశారు. సీఎం చంద్రబాబు సారథ్యంలోని టీడీపీ కూటమి ప్రభుత్వంపై కరువు రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. వారి కలలు సాకారం అయ్యేలా బడ్జెట్ కేటాయింపులు చేసి అటకెక్కిన ప్రాజెక్టులకు జీవం పోయాలని, గురువారం ప్రవేశపెట్టే బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అంకెల కూర్పులో కరువు జిల్లాకు సముచిత స్థానం కల్పించాలని సాగు నీటి నిపుణులు కోరుతున్నారు.

కృష్ణా బోర్డు.. గుండ్రేవులపై స్పష్టమైన ప్రకటన చేయాలి

రాష్ట్ర పునర్విభజన తరువాత కృష్ణా, గోదావరి జలాల పంపకాల్లో ఏ తేడాలు రాకుండా ఉండేందుకు కృష్ణా, గోదావరి నదీ యాజమాన్య బోర్డులు ఏర్పాటు చేశారు. కృష్ణా నదీయాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) ఏపీలో ఏర్పాటు చేయాలని ఏపీ విభజన చట్టంలో స్పష్టంగా ఉంది. ఈ బోర్డు ప్రధాన కార్యాలయం పదేళ్లుగా హైదరాబాదులోనే ఉండేది. గత వైసీపీ ప్రభుత్వం కృష్ణా బేసిన్‌కు ఏమాత్రం సంబంధం లేని విశాఖపట్నంలో ఏర్పాటు చేసింది. అయితే.. తెలుగు రాష్ట్రాల్లో కృష్ణా నదిపై నిర్మించిన వివిధ ప్రాజెక్టులు ముప్పాతిక శాఖ కర్నూలు నగరానికి దగ్గరగా ఉన్నాయి. శ్రీశైలం ఎగువన రెండు రాష్ట్రాలు పలు వరద నీటి ఆధారంగా ప్రాజెక్టులు నిర్మించారు. ఈ ప్రాజెక్టులు సహా శ్రీశైలం, నాగార్జునసాగర్, జూరాల.. వంటి ప్రాజెక్టుల పర్యవేక్షణ, నీటి కేటాయింపులు, నీటి సమస్యల పరిష్కారానికి కర్నూలు నగరం ఎంతో అనువైనది సాగునీటి నిపుణులు అంటున్నారు. కృష్ణా బోర్డు కర్నూలులో ఏర్పాటు చేసేలా ఈ సమావేశాల్లో కీలక నిర్ణయం తీసుకోవాలి.

- తుంగభద్ర నదిపై రెండు తెలు గు రాష్ట్రాలకు ఉపయోగకరంగా 20 టీఎంసీల సామర్థ్యంతో గుండ్రేవుల జలాశయం నిర్మాణానికి గత టీడీపీ ప్రభుత్వంలో నాటి సీఎం చంద్రబాబు 2019 ఫిబ్రవరి 21న ఆనాటి సీఎం చంద్రబాబు రూ.2,890 కోట్లు మంజూరు చేస్తూ జీవో నంబరు.153 జారీ ఇచ్చారు. జగన్ ప్రభుత్వం వచ్చాక ఇంటర్ స్టేట్ సమస్య అనే ముద్ర వేసి కోల్డ్ స్టోరేజ్‌లో పెట్టేశారు. ఈ బడ్జెట్‌లోనైనా ఆ ప్రాజెక్టుకు మోక్షం కల్పించాలి.
- కర్నూలు, ఆదోనిలో మెడికల్ కళాశాల నిర్మాణాలు చేపట్టారు. వివిధ దశల్లో ఉన్నాయి.నిధులు ఇచ్చి నిర్మాణం వేగం పెంచాలి. అదే క్రమంలో రాష్ట్ర విభజన చట్టంలో భాగంగా రూ.160 కోట్లతో కర్నూలు సర్వజన వైద్యశాల ఆవరణలో నిర్మాణం చేపట్టిన స్టేట్ క్యాన్సర్ యూనిట్ భవనం మాత్రమే పూర్తయింది. క్యాన్సర్ చికిత్సకు అవసరమైన ఆధునిక యంత్రాలు తక్షణమే సమకూర్చాలి.
- ఉమ్మడి జిల్లాలో కర్నూలు, నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరులో 21,300 టీడ్కో ఇళ్లు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయి. అలాగే.. కర్నూలు జిల్లాలో గత ప్రభుత్వం జగనన్న కాలనీల పేరిట 37,550 ఇళ్లు చేపట్టి 17,071, నంద్యాల జిల్లాలో 46,734 ఇళ్లు చేపట్టి 26,414 ఇళ్లు కూడా పూర్తి చేయలేని పరిస్థితి ఉంది. వీటిపై దృష్టి పెట్టాలి. అదే క్రమంలో జగనన్న కాలనీల పేరిట జరిగిన భూ సేకరణలో జరిగిన అవినీతిని వెలికితీయాలి.

కనీసం రూ.వెయ్యి కోట్లు ఇవ్వండి

ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో శ్రీశైలం, కేసీ కాలువ, సుంకేసుల జలాశయం, ఎస్ఆర్బీసీ, గాలేరు-నగరి ప్రాజెక్టు, తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ), గాజులదిన్నె ప్రాజెక్టు, తెలుగుగంగ కాలువ, గురురాఘవేంద్ర ఎత్తిపోతల పథకం, సిద్ధాపురం లిఫ్ట్, ముచ్చుమర్రి, హంద్రీనీవా ప్రాజెక్టు.. వంటి ప్రాజెక్టులు ఉన్నాయి. వీటి నిర్వహణతోపాటు గత టీడీపీ ప్రభుత్వంలో ప్రతిష్టాత్మకం గా చేపట్టి.. గత జగన్ ప్రభుత్వంలో పడకేసిన వేదవతి ప్రాజెక్టు, ఆర్డీఎస్ కుడి కాలువ పనులు పునఃప్రారంభం కావాలంటే నిధులు ఇవ్వాలి. నిర్వహణ, విద్యుత్ బిల్లుల కోసం రూ.2,500 కోట్లు కేటాయించాలని ఇంజనీర్లు అంటున్నారు. అయితే.. రాబోయే ఆరు నెలల కోసం ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశ పెడుతున్నారు. అయా ప్రాజెక్టులు పనులు మొదలు పెట్టేందుకు కనీసం రూ.వెయ్యి కోట్లైనా ఇవ్వాలని కోరుతున్నారు. అయితే రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశాల మేరకు తక్షణ మరమ్మతులకు రూ.12.77 కోట్లు ఇవ్వాలని ఆ శాఖ కర్నూలు ప్రాజెక్ట్ సీఈ కబీర్‌బాషా ప్రభుత్వానికి నివేదిక పంపారు.

తక్షణ మరమ్మతులకు అవసరమైన నిధులు రూ.కోట్లలో

ప్రాజెక్టు	పనులు	నిధులు
టీబీపీ ఎల్లెల్సీ ఆదోని డివిజన్	28	4.30
గురురాఘవేంద్ర ప్రాజెక్టు	7	1.29
కేసీ కెనాల్, నంద్యాల డివిజన్	34	3.10
మైనర్ ఇరిగేషన్, కర్నూలు	37	3.02
మైనర్ ఇరిగేషన్, నంద్యాల	40	1.06
మొత్తం	146	12.77

ముగిసిన నామినేషన్ల పర్వం

స్టాండింగ్ కమిటీ ఎన్నికల బరిలో 15 మంది

పాణ్యం, కోడుమూరు నియోజకవర్గాల నుంచి ఇద్దరు సభ్యుల ఖరారు?



ఇన్‌చార్జి కమిషనర్‌కు నామినేషన్ ఇస్తున్న టీడీపీ కార్పొరేటర్ విజయకుమారి

కర్నూలు(న్యూసిటీ), జూలై 24: నగర పాలక సంస్థ పరిధిలోని స్టాండింగ్ కమిటీ ఎన్నికల నామినేషన్ల పర్వం బుధవారం ముగిసింది. చివరి రోజు నగర పాలక కార్యాలయంలో ఇన్‌చార్జి కమిషనర్ పీవీ. రామలింగేశ్వర్‌కు ముగ్గురు కార్పొరేటర్లు నామినేషన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ చిన్నరాముడు, కార్యదర్శి నాగరాజు, సీ3 క్లర్క్ శ్రీకాంత్ ఉన్నారు.

- **బరిలో 15 మంది కార్పొరేటర్లు:** ఐదుగురు కమిటీ సభ్యులకుగాను 15 మంది బరిలో ఉన్నారు. ఇప్పటికే పాణ్యం, కోడుమూరు నియోజకవర్గం నుంచి ఇద్దరు సభ్యులను ఖరారు చేసుకున్నారు. పాణ్యం నియోజకవర్గం నుంచి 31వ వార్డు మిద్దె చిట్టెమ్మ నామినేషన్ దాఖలు చేసారు. అయితే పాణ్యం నుంచి ఎవ్వరూ ముందుకు రాకపోవడంతో కోడుమూరు నియోజకవర్గం నుంచి 40 వార్డు కార్పొరేటర్ విక్రమసింహారెడ్డిని బలపరిచేలా నిర్ణయం తీసుకున్నారు. దీంతో పాణ్యం నియోజకవర్గం నుంచి ఇద్దరు సభ్యులు ఖరారైనట్లు తెలుస్తోంది. అయితే స్టాండింగ్ చైర్మన్‌గా మేయర్ వ్యవహరిస్తారు. ఇందులో ఐదుగురు కమిటీ సభ్యులు ఉంటారు. వీరికి సంబంధించి గతంలో చేసుకున్న ఒప్పందం ప్రకారం పాణ్యం నియోజకవర్గం నుండి ఇద్దరు, కర్నూలు నియోజకవర్గం నుండి ముగ్గురు ఉండాలి. ప్రస్తుతం కర్నూలు నియోజకవర్గం వైసీపీ-07, కర్నూలు నియోజకవర్గం టీడీపీ-04, పాణ్యం నియోజకవర్గం వైసీపీ-01, కోడుమూరు నియోజకవర్గం వైసీపీ-02 కర్నూలు నియోజకవర్గం ఇండిపెండెంట్ ఒకరు నామినేషన్లు దాఖలు చేశారు.
- **కర్నూలు నియోజకవర్గంలో ఉత్కంఠ:** ఇటీవల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో వైసీపీ నుంచి టీడీపీలోకి సుమారు 8 మంది కార్పొరేటర్లు వెళ్లిపోయారు. దీంతో ఈసారి ఎలాగైనా టీడీపీ నుంచి కమిటీలో స్థానం సంపాదించాలని ఐదుగురు కార్పొరేటర్లు నామినేషన్ దాఖలు చేశారు. అదే విధంగా వైసీపీ నుంచి ఏడుగురు నామినేషన్ వేశారు. అయితే కర్నూలు నియోజకవర్గం టీడీపీ నుంచి ఎవ్వరిని కమిటీ సభ్యులుగా ఎన్నుకోవాలో జిల్లా పార్టీ కార్యాలయంలో చర్చిస్తున్నారు. దీంతో పాటు వైసీపీ అధినాయకత్వం కూడ ఇదే పనిలో ఉంది. ఎవరిని పోటీలో ఉంచాలా...ఎవ్వరిని విత్‌డ్రా చేయించాలో వైసీపీ నాయకులకు అంతుపట్టడం లేదు. పోటాపోటీగా నామినేషన్ దాఖలు చేశారు. అంతే కాకుండా ప్రస్తుతం నాల్గవ స్టాండింగ్ కమిటీ ఎన్నికలు జరుగుతున్నాయి. ఇటీవల జరిగిన మూడో స్టాండింగ్ కమిటీ సభ్యులకు నిరాశే మిగిలింది. ఎన్నికైన 8 నెలలకే సాధారణ ఎన్నికల నోటిఫికేషన్ రావడం...కేవలం మూడు మాత్రమే స్టాండింగ్ కమిటీ సమావేశాలు జరగడంతో నిరాశ చెందారు. అయితే నాల్గవ స్టాండింగ్ కమిటీ సభ్యులకు మాత్రమే సంవత్సరపాటు ఎలాంటి ఇబ్బంది ఉండదు. అయితే చివరి స్టాండింగ్ కమిటీ సభ్యులకు కూడ 2026లో వచ్చే కార్పొరేషన్ ఎన్నికలతో కేవలం 8 నెలలు మాత్రమే ఉంటుంది.

సంతాన లేమికి ఐవీఎఫ్

● ఆలస్యంగా వివాహాలు, ఒబెసిటీ, ఒత్తిడి, వ్యసనాలే కారణం ● నేడు వరల్డ్ ఐవీఎఫ్ డే

కర్నూలు(హాస్పిటల్), జూలై 24: ఇటీవల సంతాన లేమి ఒక ప్రధాన సమస్యగా మారింది. అందువల్ల కృత్రిమ పద్ధతుల్లో ఫలదీకరణ ప్రక్రియ నిర్వహించి బిడ్డకు జన్మనిచ్చే పద్ధతి ఇప్పుడు అందుబాటులోకి వచ్చింది. దీని గురించి అవగాహన కోసం ప్రతి ఏటా జూలై 25న వరల్డ్ ఐవీఎఫ్ దినంగా నిర్వహిస్తున్నారు. ప్రపంచంలో మొదటి ఐవీఎఫ్ బేబీ అయిన లూయిస్ బ్రౌన్ పుట్టిన రోజును వరల్డ్ ఐవీఎఫ్ డేగా జరుపుకుంటున్నారు. సంతానోత్పత్తి సమస్యను ఎదుర్కొంటున్న జంటలకు ఫెర్టిలిటీ సాంకేతిక విషయాలపై అవగాహన కల్పించడం దీని ఉద్దేశం.

- **ఐవీఎఫ్ ఎప్పుడు అవసరం:** సంతానం కలగని వారందరికీ ఐవీఎఫ్ అవసరం లేదు. వైద్యం వల్ల సహజ పద్ధతుల్లో గర్భం ధరించేందుకు చికిత్స అందిస్తారు. సహజ సిద్ధంగా గర్భధారణ కలగడానికి అవకాశం లేకుండా ఉంటుందో వారికి మాత్రమే ప్రత్యామ్నాయంగా ఐవీఎఫ్ అవసరం. ఆడవారిలో ఫెలోపియన్ నాళాలు మూసుకుపోయినప్పుడు అండకణాలు తక్కువగా ఉన్నప్పుడు అలాగే మగవారిలో స్పెర్మ్ నాణ్యత తక్కువగా ఉన్నప్పుడు వారి అవసరం అవుతుంది. గతంలో వేలాది మంది దంపతుల్లో ఒకటి, రెండు జంటల్లో మాత్రమే సంతానలేమి కనిపించేది. ప్రస్తుతం ఈ సమస్య ప్రతి వంద మంది దంపతుల్లో 8 జంటల్లో కనిపిస్తోంది.
- **వివాహాలు ఆలస్యం కావడం వల్ల:** మారిన జీవన విధానం, ఆహారపు అలవాట్లు సంతాన లేమికి కొంత వరకు కారణాలు. జీవితంలో స్థిరపడిన తర్వాత పెళ్లిళ్లు చేసుకోవాలన్న ఉద్దేశంతో ఆలస్యంగా వివాహం చేసుకుంటున్నారు. ఇది సంతానలేమికి ప్రధాన కారణం. 30 ఏళ్లు దాటాక వివాహాలు చేసుకోవడంతో యువతీ యువకుల్లో ఈ సమస్య తలెత్తుతోంది.

● రెండేళ్లలోపు గర్భం రావాలి..

సంతానలేమితో బాధపడుతున్న దంపతుల సంఖ్య ఇటీవల పెరుగుతోంది. లేట్ మ్యారేజెస్, ఊబకాయం, ఒత్తిడితో కూడిన జీవన విధానం, ఆల్కహాల్, స్మోకింగ్ అలవాట్లు సంతానలేమికి కారణలుగా చెప్పవచ్చు. వివాహమై రెండేళ్లు దాటుతున్నా గర్భం రాకపోతే ఏదో సమస్య ఉన్నట్లే. సంతానలేమికి అత్యాధునిక ఐవీఎఫ్ పద్ధతులు ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి.

- డా.పి. విష్ణుప్రియ, ఫెర్టిలిటీ స్పెషలిస్టు



సీఎం చొరవతోనే రాష్ట్రానికి ఆశించిన బడ్జెట్

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధర్మవరం సుబ్బారెడ్డి



డోన్, జూలై 24: సీఎం చంద్రబాబు చొరవతోనే రాష్ట్రానికి బడ్జెట్‌లో సముచిత స్థానం లభించిందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. బుధ వారం డోన్ పట్టణంలో సుబ్బారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్య మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత చంద్రబాబు రెండు సార్లు ఢిల్లీకి వెళ్లి ప్రధాని మోదీతోపాటు కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్రానికి న్యాయం చేయాలని కోరారని తెలిపా రు. సీఎం చంద్రబాబు ప్రతిపాదనలకు కేంద్రం ఆమోదం తెలిపి బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రత్యేక నిధులు కేటాయించిందన్నారు. పోలవరం ప్రాజెక్టుకు పూర్తి చేసేందుకు కేంద్రం బాధ్యత తీసుకుందని, రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.15వేల కోట్లు ఇవ్వడం హర్షించదగ్గ విషయమన్నారు. ఓర్వకల్లును పారిశ్రామిక హబ్‌గా అభివృద్ధి చేసేందుకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారా మన్ నిధులు కేటాయించడం వల్ల ఉమ్మడి కర్నూలు జిల్లాలో పారిశ్రామిక కారి డార్ అభివృద్ధికి అవకాశం ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే వెనుకబడిన రాయలసీమ జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని ప్రకటించడం హర్షణీయమన్నారు. కేంద్రం ప్రకటించిన వరాలు రాష్ట్ర ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తాయని, చంద్రబాబు కృషితోనే ఇది సాధ్యమైందని పేర్కొన్నారు.

శ్రావణ మాసోత్సవాలు జయప్రదం చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

కౌతాళం, జూలై 24: ఆగస్టు 5 నుంచి సెప్టెంబరు రెండు వరకు నెల రోజుల పాటు జరగనున్న ఉరుకుంద ఈరన్న స్వామి శ్రావణ మాసపు ఉత్సవాలను అన్ని శాఖల అధికారుల సమన్వయంతో జయప్రదం చేద్దామని ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ అన్నారు. ఉరుకుంద దేవస్థానపు కాలక్షేపపు మండపంలో బుధవారం ఉత్సవాలపై అన్ని శాఖల అధికారులతో కలిసి సమీక్ష సమావేశం పాలక మండలి అధ్యక్షుడు నాగరాజు గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి సబ్ కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించి ఉత్సవాలను జయప్రదం చేయాలని అన్నారు. రోడ్లను మరమ్మతులు చేయాలని, కండిషన్ ఉన్న బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. అట్లాగే తాగునీరు, విద్యుత్, వైద్య సదుపాయాలను అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆలయ ఈఓ వెంకటేష్, తహసీల్దార్ అలెగ్జాండర్, ఎంపీడీఓ రఘునాథ్‌గుప్త కోసిగి సీఐ ప్రసాద్, కౌతాళం ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి, పాలక మండలి అధ్యక్షుడు నాగరాజుగౌడ్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

కనకదుర్గ గోల్డ్ లోన్స్ నూతన శాఖలు ప్రారంభం



నంద్యాలలో నూతన బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న జీఎం

నంద్యాల టౌన్, జూలై 24: ఫైనాన్స్ రంగంలో గత 41 సంవత్సరాలుగా విశిష్ట సేవలు అందిస్తున్న కనకదుర్గ ఫైనాన్స్ లిమిటెడ్, కనకదుర్గ గోల్డ్ లోన్స్ సంస్థలు నంద్యాలతోపాటు నందికొట్కూరులో తమ నూతన శాఖలను బుధవారం ప్రారంభించాయి. నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి రోడ్‌తో పాటు నందికొట్కూరు పట్టణంలో నూతన బ్రాంచ్‌లను ప్రారంభించినట్లు జీఎం జె.చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంస్థకు ఆర్‌బీఐ గుర్తింపు ఉందని, తమ సంస్థ ద్వారా రూ.5 వేలు నుంచి రూ.50 లక్షల వరకు అతి తక్కువ వడ్డీకి రుణ సౌకర్యాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. బంగారంపై ప్రతి గ్రాముకు అత్యధికంగా ఫైనాన్స్ లభిస్తుందన్నారు. అలాగే వ్యాపార, వ్యక్తిగత రుణ సౌకర్యానికి సహకరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎం గురునాథ్ రెడ్డి, బ్రాంచ్ మేనేజర్ వి.రాజు, ముఖ్య అతిథులు టి.నరసింహారెడ్డి, బి.నరేంద్ర రెడ్డి, కంపెనీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్తి తగాదాలతో తాగు నీటిలో పురుగుల మందు

కేసు నమోదు చేసుకున్న పోలీసులు



పురుగుల మందు నీళ్లను చూపుతున్న మద్దమ్మ కుటుంబ సభ్యులు

సి. బెళగల్, జూలై 24: ఆస్తి తగాదాలతో అవతలి వాళ్లను హత మార్చాలని తాగునీటి కుళాయిలో పురుగుల మందు కలిపారు. ఈ ఆరోపణపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని ముడుమాల గ్రామానికి చెందిన అంజనేయులకు ఇద్దరు భార్యలు. మొదటి భార్య చిన్నక్క, రెండో భార్య మద్దమ్మ. వీరి మధ్య ఆస్తి పంపకాల్లో కొద్ది రోజులుగా తగాదాలు ఉన్నాయి. చిన్నక్క ఇంటి నుంచి మద్దమ్మ ఇంటి వైపు తాగునీటి కుళాయి వెళుతుంది. మద్దమ్మ కుటుంబాన్ని అంతం చేయాలని ఆలోచనతో చిన్నక్క కొడుకులు సుంకన్న, శేఖర్ బుధవారం తాగునీటిలో పురుగుల మందు కలిపి వదిలారు. కుళాయి నీటిలో నురగ రావడం, వాసన వేయడంతో అనుమానం వచ్చి మద్దమ్మ ఎస్ఐకి తిమ్మారెడ్డికి ఫిర్యాదు చేసింది. కేసు విచారణ చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

పత్తికొండలో డెంగీ కేసు నమోదు

పత్తికొండ, జూలై 24: పత్తికొండ పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీలో డెంగీ కేసు నమోదైంది. కాలనీకి చెందిన మహాలక్ష్మికి రక్తపరీక్షల్లో డెంగీ అనుమానిత లక్షణాలు ఉన్నట్లు వైద్యులు చెప్పడంతో కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో పరీక్షలు చేయించుకుంది. వైద్య సిబ్బంది డెంగీగా నిర్ధారించి చికిత్స అందిస్తున్నారు.

యువ రైతు ఆత్మహత్య

క్రిష్ణగిరి, జూలై 24: పోతుగల్లు గ్రామానికి చెందిన యువరైతు చక్రవర్తి ఆచారి(26) బుధవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వ్యవసాయంలో అప్పులపాలు కావడంతో మంగళవారం రాత్రి గదిలోకి వెళ్లి ఉరి వేసుకున్నాడు. మృతుడికి భార్య ఉంది. తండ్రి రమణయ్య ఆచారి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఖాజావలి తెలిపారు.

ట్రేడింగ్‌లో లాభం వచ్చిందని మోసం

కర్నూలు, జూలై 24: ట్రేడింగ్‌లో లాభం వచ్చిందని, ఆ డబ్బులు తీసుకోవాలంటే 20 శాతం కమిషన్ చెల్లించాలని చెప్పడంతో మోసపోయామని గుర్తించిన బాధితులు మూడో పట్టణ పోలీసులను ఆశ్రయించారు. డాక్టర్స్ కాలనీకి చెందిన సాయిరాం అనే వ్యక్తి అమిత్‌షా అనే వ్యక్తికి చెందిన ఓ వాట్సాప్ గ్రూపులో ఆన్‌లైన్ ట్రేడింగ్ కోర్సులో జాయిన్ అయ్యాడు. కోర్సులో భాగంగా సాయిరాంకు చెందిన ఆధార్, పాన్ కార్డులను తీసుకుని అకౌంట్ ఓపెన్ చేశారు. ఈ కోర్సు ద్వారా ట్రేడింగ్ అత్యధిక లాభాలు వస్తాయని నమ్మించి రూ.8.40 లక్షలు డిపాజిట్ చేయించారు. తర్వాత అదే అకౌంటులో రూ.81.19 లక్షలు లాభం వచ్చిందంటూ జమ చేశామని, ఆ నగదు విత్‌డ్రా చేసుకోవలంటే 20 శాతం కమిషన్ చెల్లించాలంటూ సూచించారు. బాధితునికి అనుమానం వచ్చి పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేశారు.

పత్తి పంటల పరిశీలన



పత్తి రైతులకు లింగాకర్షక బుట్టలు అందజేస్తున్న శాస్త్రవేత్త

మిడుతూరు, జూలై 24: నంద్యాల జిల్లా ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త, కోఆర్డినేటర్ డా. రామకృష్ణ రావు, మండల వ్యవసాయాధికారి పీరునాయక్ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని తలముడిపి, మిడుతూరు, నాగలూటి, కడుమూరు గ్రామాల్లో పత్తి పంటను పరిశీలించారు. ప్రస్తుతం పత్తి పంటలో రసం పీల్చు పురుగులు, మెగ్నీషియం దాతు లోపం వల్ల నష్టం కలుగజేస్తున్నట్లు గమనించామని చెప్పారు. రసం పీల్చు పురుగుల నివారణ చర్యల గురించి డా. రామకృష్ణారావు రైతులకు వివరించారు. పత్తి పంటలో సమగ్ర సస్యరక్షణ పద్ధతుల ద్వారా గులాబీ రంగు పురుగు నివారణకు తలముడిపి, మిడుతూరు గ్రామాల్లో పర్యటిస్తున్నట్లు తెలిపారు. ఎకరానికి 10 లింగాకర్షక బుట్టలు, 10,000 పీపీఎం గాడత వేప నూనె, 400 మి.లీ. ప్రొఫినోపాస్, 400 మి.లీ. క్లోరో పైరిఫాస్, 500 మి.లీ. క్లొరాత్ర నిలిప్రాల్, 60 మి.లీ. లాండ సహలాత్రిన్ పంపిణీ చేసినట్లు తెలిపారు. అనంతరం ఎకరానికి 10 లింగాకర్షక బుట్టలు పత్తి పంటలో ఎలా పెట్టుకోవాలో రైతులకు అవగాహన కల్పించారు. వీఏఎస్‌లు సరస్వతి, అశోక్, ప్రమీల, రైతులు పాల్గొన్నారు.

మేలైన సాగు పద్ధతులపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ రాజశేఖర్

నంద్యాల రూరల్, జూలై 24: పొలం బడితో మేలైన వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నట్లు నంద్యాల సహాయ వ్యవసాయ సంచాలకుడు రాజశేఖర్ తెలిపారు. నంద్యాల మండలం చాబోలు గ్రామంలో బుధవారం మండల వ్యవసాయాధికారి ప్రసాదరావు ఆధ్వర్యంలో ఖరీఫ్ 2024 వరి పంటలో మేలైన సాగు పద్ధతుల గురించి వివరించారు. ఏడీఏ మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు పొందడానికి, పండిన పంటను బహిరంగ మార్కెట్‌లో అధిక దరలను పొందడానికి వీలుకలుగుతుందని చెప్పారు. పంట ఉత్పత్తులకు ప్రభుత్వం ద్వారా ధ్రువీకరణ పత్రాలు పొందవచ్చని తెలిపారు. తక్కువ ఖర్చుతో రసాయనిక మందుల అవశేషాలు లేని దిగుబడులు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

'రాష్ట్ర పునర్నిర్మాణమే సీఎం చంద్రబాబు ధ్యేయం'



మాట్లాడుతున్న తెలుగు యువత నాయకుడు వెంకటేశ్వర్లు

నంద్యాల (నూనెపల్లె), జూలై 24: వైసీపీ దగా పాలనతో అభివృద్ధిలో వెనక్కి వెళ్లిన రాష్ట్రాన్ని గాడిలో పెట్టి రాష్ట్ర పునః నిర్మాణమే ధ్యేయంగా పని చేస్తున్న వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని తెలుగు యువత నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం నంద్యాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతను కల్పించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. కేంద్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వ నిర్మాణంలో కీలకంగా వ్యవహరించిన చంద్రబాబు కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అవసరమైన నిధులను రాబట్టుకోవడంలో ఎంతో చొరవ చూపారని అన్నారు. అమరావతి రాజధానికి రూ.15 వేల కోట్లు, పోలవరం నిర్మాణానికి పూర్తిగా కేంద్రమే బాధ్యత వహించడం, వైజాగ్-చెన్నై ప్రత్యేక కారిడార్‌కు నిధులు, రాష్ట్రంలో వెనుకబడ్డ ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రకాశం జిల్లాలకు బుందేల్‌ఖండ్ లాంటి ప్రత్యేక ప్యాకేజి సాధించుకోవడంలో రాష్ట్ర కూటమి ప్రజా ప్రతినిధులు విజయం సాధించారని అన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఏనాడు కేంద్ర బడ్జెట్ నుంచి నిధులు రాబట్టుకోలేని జగన్ ఇప్పుడు ఢిల్లీలో ధర్నా పేరుతో రాజకీయాలు చేయడం ఆయనకే దక్కిందని విమర్శించారు. తెలుగు యువత నాయకులు ఫిరోజ్, హబీబ్, పత్తి ఉదయ్, జమాల్, షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

సారా స్థావరంపై దాడులు

మహానంది, జూలై 24: మహానంది మండలంలోని నల్లమల అటవీ ప్రాంతంలో 400 లీటర్ల నాటుసారా ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. బుధవారం మహానంది సమీపంలోని తెలుగుగంగ ప్రధాన కాలువ సమీపంలోని నల్లమలలో నాటుసారా ఊట ఉందన్న సమాచారం మేరకు సిబ్బంది సాయంతో దాడులు నిర్వహించినట్లు చెప్పారు. ఇందులో భాగంగా పచ్చర్ల గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లును అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేసామన్నారు. 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈదాడుల్లో పోలీసులు రవి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

న్యాయవాది అనుమానాస్పద మృతి

నంద్యాల (నూనెపల్లె), జూలై 24: నంద్యాల నూనెపల్లెలో న్యాయవాది శివరాం(30) అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వెలుగోడుకు చెందిన శివరాం నంద్యాలలోని నూనెపల్లెలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. రెండు రోజుల క్రితం ఇంటిలోని బాత్‌రూంలో అనుమానాస్పదంగా మృతి చెందారు. అనుమానం వచ్చిన స్థానికులు త్రీటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

పోతిరెడ్డిపాడుకు చేరిన కృష్ణా జలాలు



పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ అప్రోచ్ కాలువలోకి చేరిన నీరు

జూపాడుబంగ్లా, జూలై 24: ఎగువ ప్రాంతంలో వరదలు రావడంతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. వర్షం భారీగా కురవడంతో వారంరోజుల్లోనే శ్రీశైలం జలాశయం 810 అడుగుల నుంచి బుధవారం రాత్రికి 850 అడుగులకు చేరింది. పోతిరెడ్డిపాడు అప్రోచ్ కాలువలోకి 8 అడుగులమేరు వచ్చి చేరాయి. ఎగువ ఉన్న జూరాల ప్రాజెక్టు నుంచి శ్రీశైలం జలాశయంలోకి 175000 క్యూసెక్కులకుపైగా వచ్చి చేరుతున్నాయి. ఇలాగే ఇన్‌ఫ్లో కొనసాగితే వారం రోజులు శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయిలో నీటిమట్టం వచ్చి చేరే అవకాశాలు ఉన్నాయి. రాయలసీమకు గుండెకాయలాంటి పోతిరెడ్డిపాడు నుంచి నీటిపారుదలశాఖ అధికారుల నుంచి అనుమతివస్తే శని, ఆదివారం దిగువకు విడుదల చేసే అవకాశాలు ఉన్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. అతితక్కువ దినాల్లోనే వర దనీరు శ్రీశైలం జలాశయానికి వచ్చి చేరడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పరిహారం ఇచ్చే దాకా పనులు చేయనివ్వం

● సోలార్ పనులను అడ్డుకున్న కందికాయపల్లి రైతులు



సోలార్ పనులను అడ్డుకున్న రైతులు

పాణ్యం, జూలై 24: సోలార్ పనుల్లో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం ఇచ్చేవరకు పనుల చేయనివ్వబోమని కందికాయపల్లి గ్రామ రైతులు డిమాండ్ చేశారు. మండలంలోని కందికాయపల్లిలో గ్రీన్‌కో ఎనర్జీస్ ప్రైవేట్ లిమిటెడ్ చేపట్టిన సోలార్ పనులను బుధవారం గ్రామస్థులు, రైతులు అడ్డుకున్నారు. పది రోజుల క్రితం తమకు నష్టపరిహారం ఇవ్వాలని పనులు నిలిపివేయడంతో పది రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన సంస్థ నిర్వాహకుల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో పనులను అడ్డుకున్నట్లు రైతులు తెలిపారు. సోలార్ పరిశ్రమతో కోల్పోయిన తమ భూములకు పూర్తి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సోలార్ పనుల్లోని వాహనాలను, కార్మికులను అడ్డుకున్నారు. గ్రామానికి ఇంత వరకు ఎటువంటి మౌలిక సదుపాయాలు కల్పించకుండా తమ పని చేసుకొంటూ హామీలు మరిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడేళ్లుగా గ్రామంలో సోలార్ పనులు చేపట్టి తమ గ్రామానికి సౌకర్యాలు కల్పించలేదని, గ్రామ ప్రజల సమస్యలను తీర్చడంలో సోలార్ నిర్వాహకులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. సోలార్ పరిశ్రమ నిర్మాణంతో దాదాపు 600 ఎకరాల సాగు భూములు కోల్పోయామన్నారు. ఇందులో పట్టా భూమి 200 ఎకరాలు, ప్రభుత్వ భూమి 150 ఎకరాలు, డీపట్టాల భూమి 150 ఎకరాలు, మిగులు భూమి 100 ఎకరాలు ఉన్నాయని చెప్పారు. వీటికి నష్ట పరిహారం ఇవ్వకపోగా పనులను వేగవంతంగా చేస్తూ గ్రామస్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. గ్రామంలోని పాడి రైతులు సోలార్ నిర్మాణంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వీటికి పశుగ్రాసం, తాగునీటి కొరత ఏర్పడిందన్నారు. ప్రభుత్వ అధికారులు గ్రామ సమస్యలపై స్పందించడం లేదన్నారు. దాదాపు 2500ల ఎకరాలలో నిర్మిస్తున్న సోలార్ పరిశ్రమ ద్వారా గ్రామ యువకులు, వ్యవసాయ కూలీలు ఉపాధి కోల్పోయారన్నారు. పంట పొలాలు పరిశ్రమలో కోల్పోయిన కుటుంబాలకు ఉపాధి అవకాశాల కల్పించాలని డిమాండ్ చేశారు. అసైన్డ్ కాని సాగు భూములకు నష్ట పరిహారం ఇవ్వాలని కోరారు. పట్టాలు లేని సాగు భూములకు ఎకరాకు రూ. 9 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అడ్వాన్స్‌గా రూ.50 వేలు ఇచ్చి మిగిలిన పరిహారం ఇవ్వకుండా సోలార్ పనులు వేగవంతంగా చేసుకుంటున్నారన్నారు. మిగిలిన బకాయిలు చెల్లించాలన్నారు. రైతుల అనుభవంలో ఉన్న ప్రభుత్వ భూములకు ఒప్పందం మేర బకాయిలు ఇవ్వాలన్నారు. పరిశ్రమ నిర్మాణంలో గ్రామానికి అందించాల్సిన న్యాయపరమైన మౌలిక సదుపాయాలు వెంటనే కల్పించాలన్నారు. గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు, సోలార్ వీధి దీపాలు, మినరల్ వాటర్‌ప్లాంటు, ఆసుపత్రి, అంబులెన్స్ సౌకర్యం, పశువుల ఆసుపత్రి, రాత్రి పూట గస్తీకి సెక్యూరిటీ ఏర్పాటు, గ్రామ రస్తాలు, తాగునీటి కొళాయిల ఏర్పాటు చేయాలని కోరారు. దోబి ఘాట్లు, పశువులకు నీటి తొట్లు, పశుగ్రాసం, దేవాలయాలలో పూజారుల ఏర్పాటు, యువకులకు ఉపాధి, క్రీడలకు క్రీడా మైదానం, శ్మశానాల అభివృద్ధి, పాఠశాలకు విద్యా వలంటీరు, ప్రహరీ, మినీ వాటర్ ప్లాంటు నిర్మాణం, కాలుష్య నివారణకు చెట్ల పెంపకం, కొత్త బస్టాండు నిర్మాణం, గ్రామ పారిశుద్యానికి కార్మికుల నియామకం తదితర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పనులు పూర్తి చేసేవరకు పనులు జరిగేదేలేదని రైతులు భీష్మించుకోవడంతో సోలార్ నిర్వాహకులు చేసిన రాజీ ప్రయత్నం ఫలించకపోవడంతో పనులు నిలిపివేశారు.

సాక్షి గణపతికి విశేష అభిషేకం

శ్రీశైలం, జూలై 24: శ్రీశైలం మహాక్షేత్రంలో లోకల్యాణం కోసం బుధవారం ఉదయం సాక్షి గణపతి స్వామికి విశేష అభిషేకం, పూజలు నిర్వహించారు. అభిషేకాన్ని పంచామృతాలతోనూ, పలుఫలోదకాలతోనూ, హరిద్రోదకం, కలశోదకం, గంధోదకం, పుష్పోదకం, శుద్ధజలాలతో అభిషేకాన్ని జరిపి మహా మంగళ హారతులు ఇచ్చారు.

జ్వాలావీరభద్ర స్వామికి..

శ్రీశైలం క్షేత్రంలో లోకకళ్యాణంకోసం మల్లికార్జునస్వామి ఆలయ ప్రాంగణంలో ఉత్తరభాగంలో ఉన్నటువంటి జ్వాలావీరభద్ర స్వామికి ప్రదోషకాలంలో విశేష అభిషేకం, పూజలు నిర్వహించింది. ఈ స్వామికి అఘోర వీరభద్రమూర్తి అని పేరు కూడా ఉంది. స్వామికి పంచామృతాలతోనూ, బిల్వోదకం, కుంకుమోదకం, హరిద్రోదకం, భస్మోదకం, గంధోదకం, పుష్పోదకం, శుద్ధజలాలతో అభిషేకం నిర్వహించారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు



నృత్యం చేస్తున్న కళాకారులు

శ్రీశైలం, జూలై 24: శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో బుధవారం కర్నూలుకు చెందిన సూర్యకళా కల్చరల్ అకాడమీ బృందంతో సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో గణేశప్రార్థన, శివతాండవం, శంభోశివశంభో, మహిషాసురమర్ధిని తదితర గీతాలకు కళాకారులు నృత్య ప్రదర్శనలతో అలరించారు.

'రాష్ట్రానికి ఊపిరి పోసిన కేంద్ర బడ్జెట్'

పాణ్యం, జూలై 24: కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రాష్ట్రానికి ఊపిరి పోసిందని టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి రామ్మోహన్ నాయుడు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల కాలంలో రాష్ట్రాన్ని వైసీపీ ప్రభుత్వం నాశనం చేసిందన్నారు. కేంద్రం బడ్జెట్‌లో అమరావతికి రూ.15 వేల కోట్లు కేటాయించడం హర్షణీయమన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పూర్తి వివరణ ఇచ్చి ప్రతిపక్షాల నోరు మూయించిందన్నారు. పాణ్యం నియోజకవర్గంలోని ఓర్వకల్లు ఇండస్ట్రీకి నిధులు, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ కేటాయించడం రాయలసీమ ప్రజల చిరకాల కోరిక తీర్చినట్టయిందని అన్నారు. కూటమి నిధుల కేటాయింపులో చేసిన కృషి అభినందనీయమని అన్నారు.

'కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి వరాల జల్లు'

నందికొట్కూరు జూలై 24: కూటమి ప్రభుత్వం ఏర్పాడ్డాక కేంద్రం బడ్జెట్‌లో ఏపీకి వరాల జల్లు ప్రకటించిందని బీజేపీ నాయకుడు చల్లా దామోదర రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మంగళవారం కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వార్షిక బడ్జెట్‌లో అమరావతి అభివృద్ధికి రూ.15 వేల కోట్ల సాయం చేయడంతో పాటు, రాష్ట్ర జీవనాడి పోలవరం పూర్తికి అధిక నిధులు మంజూరు చేసిందన్నారు. రాయలసీమ, ప్రకాశం, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ, హైదరాబాద్-బెంగళూరు పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి నిధుల కేటాయింపు, విశాఖ- చెన్నై కారిడార్‌లోని నోడ్‌లకు ప్రత్యేక సాయం, కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక కేంద్రాల అభివృద్ధి కృషి, విశాఖ-చెన్నై కారిడార్‌లో కొప్పర్తికి, హైదరాబాద్-బెంగళూరు కారిడార్‌లో ఓర్వకల్లుకు నిధులు కేటాయించిందన్నారు. నీరు, విద్యుత్, రోడ్లు ప్రాజెక్టులకు ప్రత్యేక నిధులు, విభజన చట్టంలో ఉన్న హామీల అమలు పూర్వోదయ పథకం ద్వారా ఏపీకి ప్రత్యేక ప్రాజెక్టు కేటాయించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.

'సీజన్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి'

పాములపాడు, జూలై 24: ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా సీజన్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, అప్రమత్తంగా ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లలితా ప్రభావతి విద్యార్థులకు సూచించారు. ఎర్రగూడూరు గ్రామంలో బుధవారం యూపీ స్కూల్‌లో ఆమె మాట్లాడుతూ బేటి బచావో, బేటి పడావో కార్యక్రమం ద్వారా కేంద్ర ప్రభుత్వం బాలికలకు పురుషులతో సమానంగా వివక్ష లేకుండా అన్ని రంగాల్లో ఎదగాలని సూచించారు. బాల్య వివాహాలను అరి కట్టాలని సూచించారు. అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: ఆడపిల్లలు చదువుతో పాటు ఆరోగ్య జాగ్రత్తలు తప్పక తీసుకోవాలని ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ నాగేశ్వరమ్మ సూచించారు. ముసలిమడుగులోని జడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం రాధమ్మ అధ్యక్షతన సూపర్ వైజర్ నాగేశ్వరమ్మ ఆధ్వర్యంలో బాలసభ నిర్వహించారు. మహిళా పోలీసు జ్యోతిలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు నాగమణి, సునీత, వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు విజయకుమారి, స్వర్ణలత, బ్రహ్మయ్య, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

'అనుమతిలేని ఎరువులు అమ్మితే లైసెన్సు రద్దు'



దుకాణాదారులతో మాట్లాడుతున్న ఏడీఏ ఆంజనేయ

వెలుగోడు, జూలై 24: మండలంలోని విత్తన, పురుగు మందులు, ఎరువుల ఆధీకృత డీలర్లు అనుమతి లేని అక్రమంగా ఎరువులు, పురుగుల మందులు విక్రయిస్తే లైసెన్సులు రద్దు చేస్తామని ఏడీఏ ఆంజనేయ, ఏవో పవన్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం ఆయన వెలుగోడు మండలంలోని ఆధీకృత డీలర్లతో, అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రతినెల 5వ తేదీలోపు స్టాక్ రిపోర్టులను ఏవో కార్యాలయంలో అందజేయాలన్నారు. అలాగే సిబ్బంది రైతులకు అందు బాటులో ఉండి సేవలందించాలన్నారు. రైతులు సాగు చేసిన పంటలను పరిశీలించి సత్వర చర్యలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇప్పించాలన్నారు. ఏఈవో సుధారాణి, వ్యవసాయ విస్తరణ సిబ్బంది రామకృష్ణ, వెంకటశివ, స్వర్ణ నాగమణి తదిరతులుపాల్గొన్నారు.

బాధితులతో చర్చించిన జేసీ



భూములు కోల్పోయిన బాధితులతో మాట్లాడుతున్న జేసీ

పాములపాడు, జూలై 24: నేషనల్ హైవే పనుల్లో భూములు కోల్పోయిన బాధితులతో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ చర్చించారు. పాములపాడులోని శ్రీ శారద విద్యానికేతన్ అధినేత శ్రీనివాసులుతో భూసేకరణ విషయంపై బుధవారం చర్చించారు. రెవెన్యూ అధికారులు డీఈపీఆర్ ప్రకారం 38 సెంట్లు నేషనల్ హైవే పనుల్లో పోతుందని తెలిపారు. కొన్నాళ్ల తర్వాత ఎకరా 11 సెంట్లు పోతుందని అధికారులు చెప్పడంతో కోర్టును ఆశ్రయించానని జేసీకి వివరించారు. దీంతో తహసీల్దార్, సర్వేయర్, వీఆర్వోను అడిగి వివరాలను తెలుసుకున్నారు. తమకు న్యాయం చేయాలని నేటికి పరిహారం కూడా తీసుకోలేదని, మొదట సూచించిన 38 సెంట్ల భూమిని తీసుకోవచ్చని అధికారులకు తెలిపారు. అనంతరం తహసీల్దార్ కార్యలయాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో దాస్, తహసీల్దార్ వెంకటరమణ, డీటీ పఠాన్‌బాబు, వీఆర్వోలు ముర్తుజా, కలీముల్లా, సిబ్బంది పాల్గొన్నారు.

లింగాలలో పశువైద్య శిబిరం

పాములపాడు, జూలై 24: పశువులలో సరైన సమయంలో కట్టుకోవాలంటే నట్టల నివారణ చాలా ముఖ్యమని పశు వైద్యాధికారి అనిల్, అరుణ తెలిపారు. మండలంలోని లింగాల గ్రామంలో బుధవారం పశు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ 25 పశువులకు గర్భకోశ ధ్రువీకరణ పరీక్షలు జరిపి ఇంజెక్షన్లు వేశామని తెలిపారు. చూడు కట్టని పశువులకు మినరల్ మిక్స్‌డ్ పౌడర్, మందులను అందించామని, పశువుల పెంపకం దారులు తమ పశువుల పునరుత్పత్తి, ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. శాస్త్రీయ పునరుత్పత్తి, ఆరోగ్య నిర్వహణ పద్ధతులు అనుసరించడం ద్వారా సంవత్సరానికి ఒక దూడ కలుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

'పోస్టల్ పథకాలతో ప్రయోజనం'

మహానంది, జూలై 24: పోస్టల్ శాఖ అమలు చేస్తున్న పథకాలతో ఖాతాదారులకు ఎంతో ప్రయోజనం ఉందని నంద్యాల డివిజన్ పోస్టల్‌శాఖ ఏఎస్‌పీ సత్యనారాయణ తెలిపారు. బుధవారం మహానంది మండలం ఎం.తిమ్మాపురంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోస్టల్‌శాఖలో సేవింగ్ చేసుకొంటే కలిగే లాభాలతో పాటు, వివిధ పథకాలపై జనంలోకి మనం అనే కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పించారు. ఆర్‌పీఎల్‌ఐ, పీఎల్‌ఐ, ఆర్డీ, ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంక్ గురించి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రమణ, తిమ్మాపురం పోస్టుమాస్టర్ రెహమాన్, ఎంవోలు నరసింహ, రామశేషిరెడ్డి పాల్గొన్నారు.

'మందులు తప్పకుండా వాడాలి'

నంద్యాల (నూనెపల్లె), జూలై 24: హెచ్ఐవీ బాధిత చిన్నారులు క్రమం తప్పకుండా మందులు వాడాలని రామకృష్ణ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి సూచించారు. బుధవారం కళాశాల ఆడి టోరియంలో హెచ్ఐవీ బాధిత చిన్నారులకు పౌష్టికాహారం, మందుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వైఆర్‌జీకేర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ప్రసాద్ మాట్లాడుతూ.. 50 మంది హెచ్ఐవీ బాధిత చిన్నారులకు డాక్టర్ రామకృష్ణారెడ్డి ప్రతి నెలా పౌష్టికామారం, మందులను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టే హెచ్ఐవీ చిన్నారుల పథకంలో ప్రతి బాధితునికి రూ.4 వేలు ప్రతి నెల అందజేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బయ్య, సుధారాణి, నాగమణి, వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

'నూతన ఆవిష్కరణలు చేయాలి'

నంద్యాల (నూనెపల్లె), జూలై 24: సైన్స్‌లో నూతన ఆవిష్కరణలను రూపొందించేలా విద్యార్థులను సంసిద్ధులను చేయాలని డీఈవో సుధాకరరెడ్డి సూచించారు. నంద్యాలలోని రామకృష్ణ డిగ్రీ అటానమస్ కళాశాల ఆడిటోరియంలో జిల్లాలోని అన్నీ యాజమాన్య పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులకు బుధవారం ఇన్‌స్పైర్ మనాక్ అవగాహన సదస్సు నిర్వహించారు. డీఈవో మాట్లాడుతూ వ్యవసాయం, వాతావరణ కాలుష్యం, నీటి కాలుష్యం, ఆరోగ్య పరిరక్షణ, మొక్కల ఆవశ్యకత, భూసార సంరక్షణ, నీటి పొదుపు, వ్యసాయంలో అధునాతన పద్ధతులు, అధిక దిగిబడిని సాధించడం పరిసరాల పరిశుభ్రత, సహజ వ్యవసాయం, వంటి అంశాలపై విద్యార్థులతో ప్రాజెక్టులు తయారు చేయించాలని ఆయన సూచించారు. జిల్లా సైన్స్ అధికారి సుందరరావు, జిల్లా సైన్స్ కోఆర్డినేటర్, సుబ్బారెడ్డి, నాగేంద్రకుమార్, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాషువాకు నివాళి

ఆత్మకూరు, జూలై 24: ప్రముఖ కవి, సాహిత్యవేత్త గుర్రం జాషువా 129వ వర్ధంతి సందర్భంగా ఆత్మకూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ప్రిన్సిపాల్ జిష్ణు నాగ్ విజయ్ అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజానికి మేలు చేసే ఎన్నో రచనలను గుర్రం జాషువా రచించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు విద్యాసాగర్ తదితరులు ఉన్నారు.

వాహనాల తనిఖీ

ఆత్మకూరు, జూలై 24: ఆత్మకూరు పట్టణ శివార్లలోని కర్నూలు రస్తాలో గల ఫారెస్ట్ చెక్‌పోస్టు వద్ద బుధవారం సాయంత్రం ఎస్‌ఐ వెంకటనారాయణ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. కర్నూలు - గుంటూరు జాతీయ రహదారి మీదుగా వెళ్లే వాహనాలను తనిఖీ చేసి డ్రైవింగ్ లైసెన్స్, వాహన ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి రికార్డు సక్రమంగా లేకపోవడంతో కేసులు నమోదు చేశారు. సరైన పత్రాలు లేనివారికి, డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి, పరిమితికి మించి వెళ్లిన వాహన యజమానులకు జరిమానా విధించారు.

'కార్పొరేట్లకు అనుకూలంగా కేంద్ర బడ్జెట్'

ఆత్మకూరు, జూలై 24: కార్పొరేట్లకు అనుగుణంగా కేంద్ర బడ్జెట్ ఉందని సీపీఎం నాయకులు రణధీర్, రామ్‌నాయక్, సురేంద్ర ఆరోపించారు. బుధవారం ఆత్మకూరులోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ మాటలు ఘనం.. చేతలు శూన్యం అన్నట్లుగా ఉందని విమర్శించారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు నాగేశ్వరావు, ఇస్మాయిల్ తదితరులు ఉన్నారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే యజమానులకు శిక్ష: ఎస్పీ

నంద్యాల క్రైం, జూలై 24: మైనర్లకు వాహనాలు ఇస్తే వారు ఎలాంటి ప్రమాదం చేసినా తల్లిదండ్రులు, వాహన యజమానులకు చట్టప్రకారం శిక్షలు తప్పవని ఎస్పీ ఆదిరాజ్ సింగ్ రాణా హెచ్చరించారు. బుధవారం ఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం నేరమన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపి, ప్రమాదాలకు కారణమైతే అందుకు పూర్తి బాధ్యత వాహనదారుడే వహించాల్సి ఉంటుందన్నారు. ప్రమాదానికి గురైనా ఇన్సురెన్స్ పొందడంలో ఇబ్బందులు తలెత్తుతాయని, అందువల్ల వాహనదారులు మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని సూచించారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలు జరిగినా, రహదారులపై ఇబ్బందికరంగా వాహనాలు నిలిపినా వెంటనే డయల్ 100కు సమాచారం అందించి ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. జాతీయ రహదారులపై స్పీడ్ గన్స్‌తో వేగ నియంత్రణకు కృషి చేయాలన్నారు. డ్రంకెన్ డ్రైవ్, మైనర్ డ్రైవింగ్ లైసెన్స్‌లపై ప్రధానంగా దృష్టి సారించడంతో పాటు హెల్మెట్, సీటు బెల్టు ధరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవ్ చేయకుండా, పరిమితికి మించి ప్రయాణికులు వాహనాల్లో వెళ్లకుండా అవసరమైన జాగ్రత్తలు చేపడితే దాదాపు రోడ్డు ప్రమాదాలను నియంత్రించవచ్చని ఎస్పీ తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ పోలీసుల నిబంధనలు, సూచనలు పాటిస్తూ ఇతరులకు ఇబ్బందులు కలిగించకుండా సురక్షితంగా గమ్యం చేరాలని సూచించారు.

ఎస్పీని కలిసిన అధికారులు



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న హోంగార్డు కమాండెంట్

నంద్యాల క్రైం, జూలై 24: జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ ఆదిరాజ్ సింగ్ రాణాను బుధవారం జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన అధిరాజ్ సింగ్ రాణాను మొదటిసారి జేసీ కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అలాగే హోంగార్డు కమాండెంట్ ఎం.మహేష్‌కుమార్ ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

మహానందిలో జాయింట్ కలెక్టర్ పూజలు

మహానంది, జూలై 24: మహానంది క్షేత్రంలో నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన విష్ణుచరణ్ బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ముఖమంటపం వద్ద సహాయ అర్చకుడు వెలగటూరి సునీల్‌శర్మ ఆయన స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో జేసీ మహానందీశ్వరుడికి అభిషేకం, కామేశ్వరీదేవి అమ్మవార్లకు కుంకుమార్చన పూజలు జరిపారు. ఆలయం ప్రాంగణంలోని కల్యాణ మంటపంలో ఏఈవో వెంకటేశ్వర్లు శాలువాతో సన్మానించి ప్రసాదాలు అందజేశారు. అనంతరం మహానంది సమీపంలోని మండల రెవెన్యూ కార్యాలయాన్ని జేసీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలో నెలకొన్న ప్రజా సమస్యలపై తహసీల్దార్ రామచంద్రుడు, డిప్యూటీ తహసీల్దార్ సత్య శ్రీనివాసులు ద్వారా తెలుసుకున్నారు. అనంతరం రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు.

'పౌష్టికాహారంతో ఆరోగ్యం'



అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలతో వరల్డ్ విజన్ పీవో

మహానంది, జూలై 24: పౌష్టికాహారంతో తీసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చని, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు, బాలింతలకు, పిల్లలకు అందించే పౌష్టికాహారాన్ని సిబ్బంది సక్రమంగా పంపిణీ చేయాలని వరల్డ్ విజన్ ప్రాజెక్ట్ ఆఫీసర్ తిరుపతిరావు తెలిపారు. బుధవారం మహానంది మండలం గాజులపల్లి ఆర్ఎస్, మహానందిలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆయనతో పాటు కో ఆర్డినేటర్ జెస్సీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు అందిస్తున్న పోషకాహారం, పాలు, గుడ్లను పరిశీలించారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల్య వివాహాల వల్లే కలిగే నష్టాల గురించి వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత పాల్గొన్నారు.

మల్లన్న సన్నిధిలో తెలంగాణ ఎమ్మెల్యే



ఆలయ ప్రాంగణంలో ఎమ్మెల్యే రాజాసింగ్

శ్రీశైలం, జూలై 24: శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను బుధవారం తెలంగాణ రాష్ట్రం గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దర్శనార్థం ఆలయ రాజగోపురం వద్దకు వచ్చిన ఎమ్మెల్యేకు ఆలయ అధికారులు, అర్చకులు సాదర స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామికి అభిషేకం, భ్రమరాంబికాదేవి అమ్మవారికి కుంకుమార్చనలు జరిపించుకున్నారు. దర్శనానంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో ఎమ్మెల్యేకు వేదపండితులు వేదాశీర్వచనం పలికి తీర్థప్రసాదాలను అందజేశారు. తరువాత ఆలయ అధికారులు స్వామి, అమ్మవార్ల శేషవస్త్రం, చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.

'సీసీ రోడ్లు నిర్మించాలి'

పాములపాడు, జూలై 24: వర్షాల కారణంగా గ్రామాలలోని వీధులు బురదమయంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సీసీ రోడ్లు నిర్మించాలని మాల మహానాడు జిల్లా నాయకుడు చిన్న అంకన్న డిమాండ్ చేశారు. బుధవారం పాములపాడులోని తహసీల్దార్ కార్యాలయం, సచివాలయం, వెలుగు కార్యలయానికి వెళ్లే రహదారి బురదమయంగా మారి ఉద్యోగులు, ప్రజలు అవస్థలు పడుతున్నారని ప్రజా సంఘాల నాయకులతో కలసి ఎంపీడీవో సరస్వతికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షుడు రామకృష్ణ, ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రవీణ్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

తహసీల్దార్ బదిలీ

వెలుగోడు, జూలై 24: వెలుగోడు తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న తహసీల్దార్ విజయకుమారి బదిలీ అయ్యారు. సార్వత్రిక ఎన్నికల కోసం బదిలీపై వచ్చిన ఆమె ఎన్నికలు ముగియడంతో తిరిగి ఆమె సొంత జిల్లాకు ఉన్నతాధికారులు బదిలీ చేశారు. ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు అందడంతో ఆమెను కార్యాలయ అధికారులు, సిబ్బంది శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. డీటీలు నారాయణ రెడ్డి, ఆంజనేయులు, సిబ్బంది, వెంకటరామిరెడ్డి, వీఆర్‌వోలు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'ఒలింపిక్స్ క్రీడల్లో సత్తా చాటాలి'



ర్యాలీ ప్రారంభిస్తున్న కమిషనర్, టీడీపీ నాయకుడు

ఆత్మకూరు, జూలై 24: ఫ్రాన్స్ రాజధానీ ప్యారీస్‌లో ఈనెల 26వ తేది నుంచి ప్రారంభం కానున్న ఒలంపిక్స్ క్రీడల్లో భారత్ తరుపున పాల్గొనే క్రీడాకారులు సత్తాచాటి అత్యధిక పతకాలు సాధించాలని మున్సిపల్ కమిషనర్ హరిప్రసాద్, ఆత్మకూరు పట్టణ టీడీపీ అధ్యక్షుడు వేణుగోపాల్ ఆకాంక్షించారు. ఒలింపిక్స్‌లో పాల్గొనే భారత క్రీడాకారులకు అభినందనలు తెలియజేసేలా బుధవారం జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాల విద్యార్థులు చేపట్టిన ర్యాలీని వారు ప్రారంభించారు. ఫిజికల్ డైరెక్టర్ సుదర్శన్, ఉపాధ్యాయులు మోహన్‌బాబు, రమేష్‌బాబు, శివుడునాయక్ ఉన్నారు.

'మెలకువలతో అధిక దిగుబడి'



మహిళా కూలీలతో కలిసి వరినాటు వేస్తున్న వ్యవసాయాధికారి

ఉయ్యాలవాడ, జూలై 24: వరిసాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి రాజేంద్రకుమార్ అన్నారు. ఇండియా జీఏపీ పొలం బడి కార్యక్రమంలో భాగంగా బుధవారం మాయలూరు గ్రామ పొలాల్లో పర్యటించి వరినాట్ల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఇండియా గాప్ పొలం బడిలో భాగంగా 14 వారాల పాటు వారానికి ఒక రోజు రైతులతో సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. రైతులు తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందే విధంగా సలహాలు సూచనలు ఇస్తామన్నారు. అలాగే రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు వచ్చే విధంగా కార్యచరణ రూపొందిస్తామన్నారు. రైతులతో కలిసి వరినాటు వేశారు.

679 కౌలు కార్డుల పంపిణీ: ఖరీఫ్ సీజన్‌లో కౌలు రైతులు సాగు చేసిన 679 మంది రైతులకు కౌలుకార్డులు పంపిణీ చేశామని ఏవో తెలిపారు. మండలంలో 1570 కౌలుకార్డులు టార్గెట్ కాగా ఇంత వరకు 679 కౌలుకార్డులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఏఈవో రాణెమ్మ, వీఏఏ సుమలత పాల్గొన్నారు.

అయ్యంకికి ఘన నివాళి



అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గ్రంథాలయాధికారి బషీర్ అహమ్మద్

బనగానపల్లె, జూలై 24: గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య 134వ జయంతిని బనగానపల్లె గ్రంథాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయాధికారి బషీర్ అహమ్మద్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజానికి గ్రంథాలయాల ప్రాధాన్యతను గురించి వాడవాడలా ప్రజలకు వివరించారన్నారు. కార్యక్రమంలో రిటైర్డు హెచ్ఎం శ్రీరాములు, రామచంద్రయ్య, యాంగయ్య, శ్రీనివాసులు, రామశేఖర్, షరీఫ్ పాల్గొన్నారు.

బాధ్యతగా పన్ను చెల్లించాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కె. వేణుగోపాల్

కోవెలకుంట్ల, జూలై 24: పౌరులు బాధ్యతగా ప్రభుత్వానికి పన్నులు చెల్లించాలని కోవెలకుంట్ల వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.వేణుగోపాల్ అన్నారు. బుధవారం కోవెలకుంట్ల పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ ఆదాయ పన్ను దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రతి పౌరుడు బాధ్యతగా పన్ను చెల్లిస్తే ఆ ఆదాయం ప్రభుత్వం ప్రజాసంక్షేమానికి, దేశాభివృద్ధి కోసం ఉపయోగప డుతుందని అన్నారు. అదేవిధంగా కామర్స్ విద్యార్థి ఆదాయ పన్ను లెక్కించే విధానం గురించి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో కామర్స్ ఉపన్యాసకులు వెంకటేశ్వ ర్‌రెడ్డి, ఐక్యు ఏసీ సమన్వయకర్త భాస్క ర్‌రెడ్డి, ఎల్.నాగేశ్వర్‌రెడ్డి, డాక్టర్ రామసుబ్బారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

కంది సాగుపై అన్నదాతల ఆసక్తి



రైతులు సాగు చేసిన కంది పంట

కొలిమిగుండ్ల, జూలై 24: మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులు ఈ ఏడాది కంది సాగుపై ఆసక్తి కనబరిచారు. గతంలో ఎన్నడూలేని విధంగా మండలంలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌గా 3000 ఎకరాల వరకు రైతులు కంది పంటను సాగు చేశారు. మండలంలోని బెలుం, మీర్జాపురం, కొలిమిగుండ్ల, కమ్మవారిపల్లె, పెద్దవెంతుర్ల, ఇటిక్యాల తదితర గ్రామాల్లో రైతులు కంది పంటను విస్తారంగా సాగు చేశారు. సహజంగా కొలిమిగుండ్ల మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులు అధికంగా పప్పు శనగ సాగు చేస్తారు. అయితే గత నాలుగైదేళ్లుగా శనగ సాగు రైతులను నిరాశ పరుస్తోంది. దీంతో రైతులు ప్రత్యామ్నాయ పంటలపై ఆసక్తి కనబరిచారు. కందితో పాటు, మొక్కజొన్న, పత్తి, ఆముదం పంటలను సాగు చేశారు. అయితే మరిన్ని వర్షాలు కురిస్తే కంది సాగు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

ప్రభుత్వ బడుల్లో చేర్పించాలి: యూటీఎఫ్

బనగానపల్లె, జూలై 24: పిల్లలను తల్లిదండ్రులు ప్రభుత్వ బడు ల్లో చేర్పించాలని యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు సత్యప్రకాశ్ అన్నారు. బుధవారం నందివర్గం జడ్పీ ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ సభ్యత్వ నమోదును మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రతాప్, వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా సత్యప్ర కాశ్ మాట్లాడుతూ నూతన విద్యాసంవత్సరంలో బడిఈడు పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. జిల్లా ఆడిట్ కన్వీనర్ దస్తగిరి మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలన్నారు. జీవో నంబరు 117ను రద్దు చేయాలన్నారు. ఉన్నత పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లీషు మీడియాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు సుధాకర్, జిల్లా కౌన్సిలర్‌పూజారి శ్రీనివాసులు, ప్రాన్సిస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరుస దొంగతనాలతో జనం బెంబేలు

పోలీసుల పర్యవేక్షణ కరువు

బేతంచెర్ల, జూలై 24: పట్టణంలో పట్టపగలే సోమవారం ఓ ఇంట్లో జరిగిన దొంగతనం మరువక ముందే అయ్యప్పస్వామి దేవాలయంలో పంచలోహ విగ్రహాల దొంగతనం జరగడంతో ప్రజలు బెంబెలెత్తుతున్నారు. పట్టణ ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లాలన్నా సొంత పనుల మీద బయటకు వెళ్లాలన్నా భయపడుతున్నారు. ఈ మధ్య పట్టపగలే వర్క్‌షాపు వెంకటరమణ ఇంటి తాళాలు పగలకొట్టి గుర్తు తెలియని వ్యక్తులు రెండు బీరువాల లాకర్లు తెరిచి 8.50 తులాల బంగారు, రూ.1.30 లక్షలు అపహరించుకు వెళ్లారు. ఆ తర్వాత రెండు రోజులకే పట్టణ శివారులోని నంద్యాల రోడ్డులో ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో రాత్రి దొంగలు ప్రవేశించి రూ.2.50 లక్షల విలువైన పంచలోహ వినాయక, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహాలు అపహరించుకు వెళ్లారు. పోలీసులు అధికారులు పట్టణంలో పోలీసు బందోబస్తు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



విగ్రహాల దొంగతనం జరిగిన అయ్యప్ప స్వామి ఆలయం ఇదే (ఫైల్)



దొంగతనానికి గురైన ఇల్లు

పండ్ల తోటల సాగుపై దృష్టి పెట్టండి: ఎంపీడీవో

ఉయ్యాలవాడ, జూలై 24: పండ్ల తోటల సాగుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీడీవో రఘురామ్ సూచించారు. ఉయ్యాలవాడ మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం వివిధ గ్రామాల ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లతో ఏపీవో రవిప్రకాశ్‌తో సమావేశం నిర్వహించారు. ఏపీవో మాట్లాడుతూ ఈ ఏడాది వంద ఎకరాల్లో పండ్ల తోటల సాగు టార్గెట్ కాగా ఇప్పటి వరకు 20 ఎకరాల్లో పూర్తి చేశామన్నారు. మరో 82.11 ఎకరాల్లో వరి, నిమ్మ, మామిడి, మునగ, మల్లె తదితర పంటలు సాగుకు అనుమతులు వచ్చాయన్నారు. వీటిని త్వరగా పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు.

'మినీ గోకులాలకు దరఖాస్తు చేసుకోండి'

ఐదు ఎకారాల్లోపు ఉన్న రైతులు మినీ గోకులాలకు దరఖాస్తు చేసుకోవాలని ఉపాధి ఏపీవో రవిప్రకాశ్ తెలిపారు. వీటికి ఉపాధి హామీ ద్వారా 90 శాతం సబ్సిడీ ఇస్తున్నట్లు తెలిపారు. రెండు బర్రెల షెడ్డు ఏర్పాటుకు రూ. 1.15 లక్షలు, కాగా 10 శాతం రైతు వాటా చెల్లించాల్సి ఉంటుందన్నారు. నాలుగు బర్రెల షెడ్డుకు 1.65 లక్షలు, ఆరు బర్రెల షెడ్డుకు 2.39లక్షలు మంజూరు చేస్తామన్నారు. అదే విధంగా గొర్రెలు, కోళ్ల పెంపకానికి ఉపాధి హామీ ద్వారా 70 శాతం సబ్సిడీ ఇస్తామని రైతులు 30 శాతం వాటా చెల్లించాలని తెలిపారు. అర్హులైన రైతులు స్థానిక వెటర్నరీ వైద్యశాలలకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో రఘురామ్

ఉమ్మడి జిల్లాకు మహర్దశ

- ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి
- విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే



విజయవాడ కనకదుర్గమ్మ దర్శనానికి వెళ్తున్న ఎమ్మెల్యే కోట్ల

డోన్, జూలై 24: సీఎం చంద్రబాబు సమర్థవంతమైన పాలనతో ఉమ్మడి కర్నూలు జిల్లాకు మహర్దశ రానుందని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. బుధవారం విజయవాడలోని కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ఎమ్మెల్యే కోట్ల ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధి కుంటు పడిందన్నారు. ఓర్వకల్లు పారిశ్రామిక హబ్‌ను నిర్లక్ష్యం చేసి నిరుద్యోగ యువతకు, ఉపాధి అవకాశాలు లేకుండా చేశారన్నారు. సీఎం చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. కేంద్ర బడ్జెట్‌లో ఓర్వకల్లు పారిశ్రామిక హబ్‌కు గౌరవం తీసుకువచ్చేలా నిధుల కేటాయింపునకు సీఎం చంద్రబాబు కృషి చేశారన్నారు. ఎమ్మెల్యే వెంట డీసీఎంఎస్ మాజీ చైర్మన్ లక్ష్మీరెడ్డి, టీడీపీ నాయకులు ఓబులాపురం శేషిరెడ్డి, ఎరుకుల చెరువు శివ, సీనియర్ న్యాయవాది నల్లమేకల పల్లి భాస్కర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయండి: డీఈ

నంద్యాల, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ హౌసింగ్ సబ్‌డివిజన్‌లో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని డీఈ నాగరాజు సూచించారు. ఆళ్లగడ్డ పట్టణంలోని హౌసింగ్ డీఈ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన హౌసింగ్ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలానికి 1380 గృహాలు మంజూరు కాగా 711 మాత్రమే పూర్తయ్యాయని, మిగిలిన 599 వెంటనే పూర్తి చేసుకునేలా లబ్ధిదారుల్లో అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. గృహాలు పూర్తి అయితేనే బిల్లులు వస్తాయని చెప్పారు. సమావేశంలో ఏఈ రమణా రెడ్డి, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీడీవో కుటుంబానికి న్యాయం చేయాలి



నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న అధికారులు

ప్యాపిలి, జూలై 24: పశ్చిమ గోదావరి జిల్లాలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఎంపీడీవో వెంకటరమణ కుటుంబానికి న్యాయం చేయాలని ఎంపీడీవో సాయిమనోహర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట వెంకటరమణ మృతిపై కార్యాలయం సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఎంపీడీవో సాయి మనోహర్ మాట్లాడుతూ పై అధికారులు, రాజకీయ నేతల వత్తిడి వల్లనే వెంకటరమణ ఆత్మహత్య చేసుకున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ బాలక్రిష్ణుడు, కార్యదర్శులు శివకుమార్, సచివాలయ ఉద్యోగులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

వాల్మీకి బోయ సంఘం జిల్లా అధ్యక్షుడిగా సురేష్

డోన్(రూరల్), జూలై 24: డోన్ మండలం మల్యాల గ్రామానికి చెందిన ఎన్.సురేష్‌ను కర్నూలు జిల్లా ఏపీ వాల్మీకి బోయ సంఘం ప్రొఫెషనల్ వింగ్ అధ్యక్షుడిగా నియమించారు. ఈ మేరకు ఏపీ వాల్మీకి బోయ సంఘం రాష్ట్ర కమిటీ ప్రకటించింది. ఈ సందర్భంగా నల్లబోతుల సురేష్ డోన్‌లో మాట్లాడుతూ వాల్మీకి హక్కుల సాధన కోసం పోరాడుతామని, వాల్మీకి పేద కుటుంబంలోని పిల్లల చదు వుకు సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు

కోవెలకుంట్ల, జూలై 24: శ్రీవాసవి బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల కోవెలకుంట్లలో అతిథి అధ్యాపక పోస్టులను భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వేణుగోపాల్ తెలిపారు. ఈ కళాశాలలో ఎకనామిక్స్, కంప్యూటర్ అప్లికేషన్స్, పొలిటికల్ సైన్స్ పోస్టులకు అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఉన్నత విద్యాశాఖ కమి షనర్ ఆదేశాల ప్రకారం పోస్టుగ్రాడ్యుయేషన్ అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 29వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని, వీరికి ఈ నెల 31న ఉదయం ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలి పారు. పీహెచ్‌డీ, ఎన్‌ఈటీ/ ఎస్‌ఈటీ పాసైన అభ్యర్థులకు ప్రాధాన్యం ఇస్తామన్నారు.

ఎస్పీని కలిసిన ఎంఎస్ఎఫ్ నాయకులు

బేతంచెర్ల, జూలై 24: నంద్యాల జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన అధిరాజ్ సింగ్ రాణాను జిల్లా ఎస్పీ కార్యాలయంలో బుధవారం ఎంఎస్ ఎఫ్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఎస్పీని కలిసి పలు సమస్యలను వివరించారు.

గర్భకోశ వ్యాధుల నివారణ శిబిరాలు

బనగానపల్లె, జూలై 24: పశువులకు ఏర్పాటు చేసిన గర్భకోశ వ్యాధుల నివారణ శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకుడు డాక్టర్ మారుతి సకారం అన్నారు. బుధవారం సంఘపట్నం గ్రామంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకం కింద చేపట్టిన గర్భకోశ వ్యాధుల నివారణ శిబిరాన్ని టీడీపీ నాయకుడు ఉగ్రసేనా రెడ్డితో కలిసి పరిశీలించారు. పశువైద్య అధికారులు, పాడి రైతులు పాల్గొన్నారు.


వ్యవసాయ పనిముట్ల పరిశీలన

చాగలమర్రి, జూలై 24: మండలంలో వైసీపీ ప్రభుత్వంలో యాంత్రీకరణ పథకం ద్వారా రైతులకు పంపిణీ చేసిన వ్యవసాయ పనిముట్ల గురించి విచారణ చేస్తున్నట్లు ఏవో రంగనేతాజీ తెలిపారు. బుధవారం పెద్దబోదనం సచివాలయ పరిధిలోని చిన్నబోదనంలో గ్రూపు రైతులకు ఇచ్చిన వ్యవసాయ పనిముట్లు, ట్రాక్టర్‌లపై విచారణ చేశారు. ఆయన మాట్లాడుతూ 16 ఆర్‌బీకేలలో రైతుమిత్ర గ్రూపులకు ట్రాక్టర్లు, స్ప్రేయర్లు, వ్యవసాయ పనిముట్లు గతంలో పంపిణీ చేశామని, వాటి పనితీరు గురించి పరిశీలిస్తున్నామని అన్నారు.

బ్రాహ్మణపల్లెలో జనసేన సభ్యత్వం: మండలంలోని బ్రాహ్మణపల్లెలో జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నాయకులు, సర్పంచ్ నేట్ల మహేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించారు. శ్రీనివాసరెడ్డి, హరినాథరెడ్డి పాల్గొన్నారు.

కూరగాయల కట్ట ధ్వంసం

వ్యాపారిపై కేసు నమోదు



మార్కెట్ సముదాయ భవనంలో ధ్వంసమైన కూరగాయల కట్ట

డోన్(రూరల్), జూలై 24: డోన్ పట్టణం రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న కూరగాయల మార్కెట్ సముదాయ భవనంలో ఏర్పాటు చేసిన 74వ నెంబర్ కూరగాయల కట్ట ధ్వంసమైంది. దీనిపై మున్సిపల్ అధికారులు డోన్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ విచారించి కూరగాయల కట్టను ధ్వంసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ప్రకృతి వ్యవసాయం ఆదర్శం కావాలి

సంజామల, జూలై 24: ప్రకృతి వ్యవసాయం భావితరాలకు ఆదర్శం కావాలని జాయింట్ డైరెక్టర్ మురళీకృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని ముదిగేడు, ముక్కమళ్ల, ఆకుమళ్ల, ఆర్.బి.కే కేంద్రాల్లో ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అందుబాటులో ఉండి సూచనలు, సలహాలను ఇవ్వాలన్నారు. ఖరీఫ్‌లో సాగు చేసే పంటలపై అవగాహన కల్పించాలన్నారు. ఆర్.బి.కె కేంద్రాల్లో సిబ్బంది అందుబాటులో ఉండి రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందజేయాలన్నారు. అనంతరం ఆకుమళ్ల శివార్లలోని శింగనపల్లె సమీపంలో 4ఎకరాల్లో 22 రకాల విత్తనాలతో సాగు చేసిన ప్రకృతి వ్యవసాయ పంటలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ నరేంద్ర రెడ్డి, కోవెలకుంట్ల ఎ.డి.ఎ సుధాకర్, వ్యవసాయ అధికారులు సుధాకర్ రెడ్డి, అబ్దుల్ హక్, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు దివ్య, బాషా, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శివరామయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయ పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ జేడీ

యర్రగుంట్లలో జేసీ కుటుంబం మూలాలు



నంద్యాల జేసీ విష్ణుచరణ్

శిరివెళ్ల, జూలై 24: నంద్యాల జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన 2019 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి విష్ణుచరణ్ కుటుంబ మూలాలు శిరివెళ్ల మండలం యర్రగుంట్ల గ్రామంలో ఉన్నాయి. జేసీ విష్ణుచరణ్ జేజినాన్న(అబ్బ) చిమ్మని వెంకట సుబ్బయ్య యర్రగుంట్ల గ్రామంలో నివశించారు. ఆయన కుమారుడు చిమ్మని సుబ్బారావు కొంత కాలం యర్రగుంట్లలో ఉండి అనంతరం విద్య, ఉద్యోగ రీత్యా ఇతర ప్రాంతాలకు వెళ్లారు. చిమ్మని సుబ్బారావు కుమారుడు విష్ణుచరణ్ పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్‌గా పని చేస్తూ బదిలీపై నంద్యాల జేసీగా రావడంతో యర్రగుంట్లలోని తొగటవీర క్షత్రియులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

స్మితా సబర్వాల్ క్షమాపణ చెప్పాలి

కోవెలకుంట్ల, జూలై 24: స్మితా సబర్వాల్ వికలాంగులకు క్షమాపణ చెప్పాలని నంద్యాల జిల్లా వికలాంగుల జేఏసీ నాయకుడు అందనం దేవరాజ్ డిమాండ్ చేశారు. బుధవారం వికలాంగులతో కలిసి కోవెలకుంట్లలో ఎస్ఐ వరప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగులు ఇంట బయట మనోవేదనకు గురవుతుంటే స్మితా సబర్వాల్ వికలాంగులపై అను చిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు.

ఉపాధిలో పండ్ల తోటల సాగుకు అవకాశం

కొలిమిగుండ్ల, జూలై 24: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా ప్రభుత్వం పండ్ల తోటల సాగుకు అవకాశం కల్పిస్తోందని మండల ఏపీవో గంగన్న బుధవారం వెల్లడించారు. ఒక్కో రైతుకు 5 ఎకరాలు సాగుకు అవకాశం ఉంటుందని, ప్రస్తుతం పండ్ల తోటలకు మార్కెట్లో మంచి గిరాకీ కూడా ఉందని అన్నారు. అదేవిధంగా రైతులు పొలం గట్లపై మామిడి, సపోట, చీనీ తదితర మొక్కలు నాటుకోవడానికి ఉపాధి పథకంలో అవకాశం ఉందన్నారు.

గ్రామ సమస్యలపై దృష్టి సారించండి

కొలిమిగుండ్ల, జూలై 24: గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారులు సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జిల్లా పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎంపీడీవో ప్రసాదరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పోలీసు బందోబస్తు మధ్య వేలం పాటలు

నంద్యాల, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ మున్సిపాలిటీలో ప్రతి ఏడాది నిర్వహిస్తున్న వేలం పాటలు బుధవారం గట్టి పోలీసు బందోబస్తు మధ్య ముగిశాయి. మున్సిపాలిటీ డైలీ మార్కెటు రూ. 5.10 లక్షలు, వారం మార్కెట్ రూ.5.05 లక్షలు, వాహనాల మెట్ట రూ.10.05 లక్షలు, కబేలా రూ.3.03 లక్షలకు పట్టణానికి చెందిన నాగాంజనేయులు అనే వ్యక్తి పాడినట్లు తెలిపారు. ఈ మొత్తం గత ఏడాది కంటే ఎక్కువ ధరకు పోయాయని కమిషనర్ రమేష్‌బాబు చెప్పారు.

పోలీసు అధికారులపై స్పీకర్‌కు ఎమ్మెల్యే ఫిర్యాదు: ఆళ్లగడ్డ డీఎస్పీ షర్ఫుద్దీన్, రూరల్ సీఐ హనుమంతనాయక్‌పై స్పీకర్‌కు ప్రివిలేజ్ మోషన్ కంప్లైట్ చేసినట్లు ఎమ్మెల్యే అఖిలప్రియ బుధవారం చెప్పారు. పోలీసు అధికారులు వైసీపీ నాయకులకు సపోర్ట్ చేస్తూ కేసులు పెడుతున్నారని, దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని స్పీకరుకు వివరించినట్లు ఆమె చెప్పారు.

లింగ వివక్షను నిర్మూలించాలి

బనగానపల్లె, జూలై 24: లింగ వివక్షతను నిర్మూలించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మానందాచారి అన్నారు. బుధవారం మండలంలోని పలుకూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ప్రొద్దుటూరుకు చెందిన స్నేహ సొసైటీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో గర్భిణులకు ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు, మహిళా పోలీసులు, గర్భిణులు పాల్గొన్నారు.

సస్య రక్షణపై అవగాహన కల్పించాలి

అవుకు, జూలై 24: రైతులకు పంటల సస్య రక్షణపై రైతులకు వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ అధికారి మురళీక్రిష్ణ అన్నారు. బుధవారం వ్యవసాయ సహాయ సంచాలకులు సుధాకర్, వ్యవసాయ అధికారి అబ్దుల్ హక్‌తో కలిసి శింగనపల్లె రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేశారు. గ్రామంలో నవధాన్యాల పంటను పరిశీలించారు.

విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలి

ప్యాపిలి, జూలై 24: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలని జిల్లా ఇంటర్ మీడియట్ విద్యాశాఖ అధికారి సునీత అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆమె సందర్శించారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు విద్యార్థులు



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం, పీడీ

చాగలమర్రి, జూలై 24: చాగలమర్రి గ్రామంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు పీడీ దాదాపీర్ తెలిపారు. బుధవారం ఎంపికైన విద్యార్థులను హెచ్ఎం కోటయ్య, సీనియర్ ఉపాధ్యాయులు అభినందించారు. పీడీ మాట్లాడుతూ ఈనెల 20న ఆళ్లగడ్డలో జరిగిన నంద్యాల జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్, యోగా పోటీలలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని చెప్పారు. హ్యాండ్‌బాల్ పోటీలలో బాల నరసింహుడు, పండు, ఉస్మాన్, యోగా పోటీలలో అఖిల్‌కుమార్, సాజిత్ ఎంపికయ్యారని తెలిపారు. హ్యాండ్‌బాల్ పోటీలు గుంటూరు, కదిరిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని అన్నారు. విశాఖపట్నంలో సెప్టెంబరులో జరిగే యోగా పోటీలకు ఇద్దరు విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు, పీఈటీ భారతి పాల్గొన్నారు.

'సర్వేను నిర్లక్ష్యం చేయొద్దు'

రుద్రవరం, జూలై 24: జిల్లాలో కుష్ఠు వ్యాధిగ్రస్థుల సర్వేను నిర్లక్ష్యం చేయకుండా ప్రతి ఇంటిలో వివరాలు సేకరించాలని జిల్లా అదనపు ఆరోగ్యశాఖ అధికారి శారదాబాయి సూచించారు. మండలంలోని నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో నరసాపురం గ్రామంలో సర్వేను పరిశీలించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారి బాబు, ఎంపీహెచ్‌వో నాగప్రసాద్, భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నూతన సాంకేతిక పద్ధతులు పాటించాలి

బనగానపల్లె, జూలై 24: నూతన సాంకేతిక వ్యవసాయ పద్ధతులను రైతులు అందిపుచ్చుకోవాలని యాగంటిపల్లె కృషి విజ్ఞానకేంద్రం కో ఆర్డినేటర్ ధనలక్ష్మి అన్నారు. బుధవారం యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రంలో కృషి విజ్ఞానకేంద్ర వ్యవస్థ దేశంలో ఏర్పడి 50 ఏళ్లు అవుతున్న సందర్భంగా స్వర్ణోత్సవ వేడుకలను నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రైతులకు వ్యవసాయంలో నూతన సాంకేతికతను రైతాంగానికి చేరవేయడానికి పుదుచ్చేరిలో వ్యవసాయ విశ్వవిద్యాలయం కింద కెవికేలు ఏర్పడినట్లు తెలిపారు. దేశంలో 731 కెవీకేలు ఉన్నట్లు తెలిపారు. హనుమంతరాయ చారిటబుల్ సొసైటీ అధికారి సురేశ్‌కుమార్, వ్యవసాయ శాస్త్రవేత్తలు రమణయ్య, సుధాకర్, బాలరాజు, కృష్ణమూర్తి, ఆదినారాయణ, రవిగౌడ్, లక్ష్మీప్రియ పాల్గొన్నారు.

'పోస్టల్ సేవలు వినియోగించుకోవాలి'

నంద్యాల, జూలై 24(ఆంధ్రజ్యోతి): పోస్టల్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని నంద్యాల పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు. సూచించారు. ఆళ్లగడ్డ పట్టణంలో బుధవారం గ్రామీణ తపాలా సేవలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కేవీ సుబ్బారెడ్డి కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోస్టల్ ఇన్‌స్పెక్టర్ రామనాథ్, మెయిల్ వర్సల్స్ పెద్దరాజు, భాస్కరరావు, తపాలా ఉద్యోగులు, ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

క్రీడా పోటీలు ప్రారంభం

చాగలమర్రి, జూలై 24: చాగలమర్రిలోని బాలికల ఉన్నత పాఠశాలలో శిక్ష సప్తహ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఏర్పాటు చేసిన క్రీడా దినోత్సవ కార్యక్రమాన్ని ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల ప్రారంభించారు. బాలికలు చేపట్టిన పిరమిడ్, ఖోఖో, కబడ్డీ తదితర పోటీలను వారు పరిశీలించారు.

వేధింపుల కేసు నమోదు

బేతంచెర్ల, జూలై 24: మండలంలోని రెహిమాన్‌పురం గ్రామానికి చెందిన శరత్ అనే యువకుడు తన భార్య బండి ఉషాను అదనపు కట్నం కోసం భర్తతోపాటు మరో ముగ్గురు వేధిస్తున్నారని వారిపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ ఎంవీ రమణ బుధవారం తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ వివరాల మేరకు.. రెండు నెలల క్రితం బళ్లారి పట్టణానికి చెందిన బండి ఉషాతో రెహిమాన్‌పురం గ్రామానికి చెందిన శరత్ ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. అయితే ఉషను భర్త శరత్‌తోపాటు అత్త సరస్వతి, మామ ఆదినారాయణ, బావ నాగార్జునలు అదనపు కట్నం కోసం శారీరకంగా మానసికంగా వేధిస్తున్నారని బాధితురాలి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందని, ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.